Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 276 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 17 - 6 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# సింగపూర్‌లో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగం

## - ఈ ఏడాది నవంబర్‌లో జరుగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ సన్నాహక సమావేశంగా సింగపూర్‌లో తొలి రోడ్ షో నిర్వహిస్తోన్న సీఐఐ








**ఇంటర్నెట్ డెస్క్:** సీఐఐ రోడ్ షో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే నాకు చాలా అభిమానం. 3 దశాబ్దాల క్రితం నుంచే సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. బ్లూ, గ్రీన్ రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని నగరాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేస్తున్నా. సింగపూర్ దేశం తర్వాత రెండో నివాసంగా అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను మార్చుకోమని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిస్తున్నాను. ఏపీలో భూమి, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నాం. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అన్ని అనుమతులు వేగంగా ఇచ్చాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుంది. అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అవుతోంది. వారికి గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించాం. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాం. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించబోతోంది.

ఏపీలో అమలు అవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నాం. పనిచేస్తూనే నైపుణ్యాలు, ఉన్నత విద్యార్హతల్ని సాధించేలా ఈ ఆపరేషనల్ యూనివర్సిటీలు ఉపకరిస్తాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగింది. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నాం. ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. త్వరలోనే భారత ఎకనామిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ మారుతుంది. వికసిత్ భారత్ 2047 విజన్‌లాగే స్వర్ణాంధ్ర 2047 విజన్ కు రూపకల్పన చేశాం. సుదీర్ఘమైన తీరప్రాంతం, అరుదైన ఖనిజాలు, పర్యాటక ప్రాంతాలు ఏపీ సొంతం. ఆక్వా, హార్టికల్చర్, వ్యవసాయం, సేవల రంగంలో ఏపీ కీలకమైన రాష్ట్రంగా ఉంది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా వివిధ దేశాలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. పూర్తి స్థాయి సన్నద్ధతతో ఈ సంక్షోభాన్ని కూడా భారత్ సమర్థంగా ఎదుర్కోగలిగింది. ఏపీ నుంచి ఎగుమతులు పెంచేందుకు మేం విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నాం. దీనికి అనుగుణంగా పోర్టులు, ఎయిర్ పోర్టులు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించేలా పనిచేస్తున్నాం. ఏపీలోని యువ శక్తి సామర్థ్యాలను పెంచేలా అందరికీ నైపుణ్యాలను పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. పారిశ్రామిక అనుకూల పరిస్థితులను కల్పించేలా 26 పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నాం. ఏపీలో భూమి లభ్యత, నీటి లభ్యత ఉంది. కృష్ణా, గోదావరి నదుల ద్వారా వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా ఉంది. పారిశ్రామికంగా మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున కల్పిస్తున్నాం. ఏపీలోని ప్రతీ ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం తెచ్చాం. అలాగే ఎంఎస్ఎంఈ సహా వివిధ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాం. రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎక్కడా జాప్యం లేకుండా అనుమతులు వేగంగా వచ్చేలా చూస్తున్నాం. ఏపీకి ఉన్న 1 వెయ్యి కిలోమీటర్లకు పైగా ఉన్న తీర ప్రాంతంలో 6 ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయి. ఈ పోర్టులను దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశీ పోర్టులకు కనెక్టు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. 7 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఏపీలో ఉన్నాయి. భోగాపురంలాంటి అంతర్జాతీయ విమానాశ్రయంతో గ్లోబల్ నగరాలకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. లాజిస్టిక్స్, అగ్రికల్చర్, సివిల్ ఏవియేషన్, ఎనర్జీలాంటి వివిధ అంశాల్లో ఫంక్షనల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఏపీలో ఉన్న పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలు అనుసంధానించేలా రహదారి, రైల్ నెట్వర్క్‌ను కూడా పెద్ద ఎత్తున నిర్మిస్తున్నాం. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డ్రోన్, డిఫెన్స్ క్లస్టర్లతో పాటు రాష్ట్రంలోని 175 చోట్ల నియోజకవర్గ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పారిశ్రామిక పార్కులకు నీరు, విద్యుత్‌లాంటి మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రాయలసీమలోని పుట్టపర్తి వద్ద 5వ తరం ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కూడా వస్తోంది. ఈవీల వినియోగం పెంచటం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేలా ప్రయత్నాలు చేస్తున్నాం. అమరావతిని మరో సింగపూర్‌గా తయారు చేయాలని మేం ప్రయత్నిస్తున్నాం. ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయటంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలను కనెక్టు చేయబోతున్నాం. హైస్పీడ్ రైల్ నెట్వర్క్ కూడా అమరావతిని హైదరాబాద్, బెంగుళూరు, చెన్నైలాంటి నగరాలను కనెక్టు చేస్తుంది. బ్లూ, గ్రీన్ సిటీగా అమరావతిని నిర్మించటం తోపాటు ఈవీల వినియోగం, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. అమరావతిలోనే ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. సింగపూర్‌లో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి చంద్రబాబు. ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా క్వాంటం అమరావతిలో కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. ప్రాజెక్టులు పెట్టే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. త్వరలోనే విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఏపీలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఉన్నాయి. దేవాలయాలు, పర్యాటక, బుద్దిస్ట్ సర్క్యూట్‌లు ఉన్నాయి. అక్వా, వ్యవసాయం, హార్టికల్చర్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవకాశం ఉంది. పెద్దఎత్తున ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను పండిస్తున్నాం. ఏపీకి వచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను పరీక్షించి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని పిలుపునిస్తున్నాను. పెట్టుబడులు పెట్టడానికి ఇది సువర్ణ అవకాశం. ఇండియా గ్రోత్ స్టోరీలో భాగస్వాములు కావాలని కోరుతున్నాను. సింగపూర్‌లో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి చంద్రబాబు. భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పెట్టుబడులు భారత్‌కు వస్తున్నాయి. ఇందులో 25 శాతం మేర ఏపీలో ప్రాజెక్టులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. భారత్‌లో ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలు ఉన్నాయి. పోర్టులు, ఎయిర్ పోర్టులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలను కనెక్టు చేస్తున్నాయి. అంతర్జాతీయంగా ఉత్పన్నమైన పరిస్థితులను ఎదుర్కునేలా కొన్ని దేశాలు సొంతంగా నిధిని ఏర్పాటు చేశాయి. సింగపూర్‌లాంటి దేశాలు సావరిన్ ఫండ్స్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. సమీప భవిష్యత్ అంతా స్టార్టప్‌లదే. వాటిని ప్రోత్సహిస్తే పెద్దఎత్తున ఉత్పత్తికి అవకాశం ఉంటుంది. పెద్ద కంపెనీలు, సంపన్నులు స్టార్టప్‌లలో పెట్టుబడి పెట్టడం విజయవంతమైన మార్గంగా చూస్తున్నాయి. అమరావతిలోనూ ఓ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను ఏర్పాటు చేశాం. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ ఆర్థిక నగరంలో ఉంటాయి. స్పీడ్ ఆఫ్ బిజినెస్‌ను టెస్ట్ చేయాలంటే ఏపీకి రండి... మీ పెట్టుబడులు ఏపీలో సురక్షితం. సింగపూర్‌లో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి చంద్రబాబు.

## రాష్ట్ర హోంమంత్రికి గుడివాడ అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### - మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ డిమాండ్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ డిమాండ్ చేశారు. మహిళా నాయకులపై నోరు పారేసుకోవడం కొంతమంది వైసీపీ నాయకులకు అలవాటుగా మారిందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఇటువంటి వ్యాఖ్యలను సమాజం మొత్తం ఖండించాలని ఆమె కోరారు. నోటికి వచ్చినట్లు మాట్లాడి కనీసం పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోవడం, జరిగిన విషయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరించడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్కృతికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. రాజకీయ విమర్శల పేరిట మహిళలపై చవకబారు వ్యాఖ్యలు చేస్తే మహిళా సాధికారత ఎలా సాధ్యమవుతుందో వైసీపీ సమాధానం చెప్పాలని వాసిరెడ్డి పద్మ డిమాండ్ చేశారు.




## కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో పవన్ భేటీ.. ఏపీలో నీటి కొరతపై చర్చలు



**ఢిల్లీ :** కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం ఢిల్లీలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై డిప్యూటీ సీఎం చర్చించారు. నీటి కొరత నివారణ, నదుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి అవసరమని సీఆర్ పాటిల్ సూచించారు. జల్ జీవన్ మిషన్ అమల్లో కృషి చేస్తున్న కేంద్ర అధికారులకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు.

**సూరత్ నమూనాను పరిశీలించాలి..**

ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత కొనసాగుతోందని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు. ప్రజలకు స్థిరమైన తాగునీటి సరఫరా కోసం మరింత సమర్థవంతమైన చర్యలు అవసరమని తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛత, నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు. సూరత్‌లో శుద్ధి చేసిన పారిశ్రామిక నీటి పునర్వినియోగ విధానాన్ని అధ్యయనం చేయాలని పవన్ కల్యాణ్ అన్నారు. సూరత్ నమూనాను ఏపీలో అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

**నదుల సంరక్షణకు సమగ్ర కార్యాచరణ అవసరం..**

ఏపీలో గత పదేళ్లుగా చర్యలు కొనసాగుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక కాలుష్యం కారణంగా నదులు, జల వనరులు ప్రభావితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' చేయ కుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆకాంక్షలకు అనుగు ణంగా నీటిని తాగునీటి ప్రమాణాలకు తీసుకురావాలని నిర్దేశించారు. నీటి పునర్వినియోగం, కాలుష్య నియంత్రణ, నదుల సంరక్షణకు సమగ్ర కార్యాచరణ అవసరమని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

## ఏపీలో నేరాల సంఖ్య 14.1 శాతం తగ్గింది : హోంమంత్రి అనిత




**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలపై ఆధారపడి ఉంటుందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమల రాకే తమ పనితీరుకు అద్దం పడుతోందని తెలిపారు. ఏపీలో క్రైం రేటు 14.1 శాతం మేర తగ్గిందని, మొత్తంగా చూసుకుంటే 34,041 కేసులు తగ్గాయన్నారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి చేస్తున్న పోలీసింగ్.. క్రైం రేటు తగ్గడానికి కారణమని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి వచ్చాక సీసీటీవీ కెమెరాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజల భాగస్వామ్యాన్ని కూడా తీసుకున్నామన్నారు. నేరం జరిగాక 24 గంటల్లో నిందితుడిని పట్టుకోడానికి సీసీటీవీలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యమన్నారు. లక్ష సీసీ కెమెరాలు పెట్టాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని.. ఇప్పటికే 70 శాతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో దిశ పేరుతో అమలు చేయలేని చట్టాన్ని తెచ్చారని హోం మంత్రి విమర్శించారు. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మహిళల రక్షణ కోసం ఐజీ స్థాయి అధికారిని నియమించి శక్తి యాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. శక్తి యాప్‌ను కోటి 50 లక్షల మంది డౌన్లోడ్ చేయడంతో పాటు వాట్సాప్ నెంబర్‌ను కూడా అందించా మన్నారు. ఇప్పటి వరకూ తప్పిపోయిన 8,356 మందిని గుర్తించి వారి ఇళ్లకు పంపించామని అనిత తెలిపారు. చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై సీరియస్ యాక్షన్ తీసుకున్నామన్నారు. కొందరు ప్రభుత్వం తీసుకునే చర్యలకు భయపడి వారికి వారే శిక్షించుకున్న సంఘటనలను చూశామన్నారు. నేరం చేసిన వ్యక్తికి శిక్ష పడాలంటే ఫోరెన్సిక్ నుంచి డిపార్ట్‌మెంట్ మొత్తం బాగా పనిచేయాలని సూచించారు. మహిళలపై నేరాల్లో 6.9 శాతం తగ్గుదల కనిపించిందని అనిత తెలిపారు. లైంగిక నేరాల్లో దర్యాప్తు నాణ్యత 31.41 శాతం నుంచి 90శాతానికి పైగా సాధించామని చెప్పుకొచ్చారు. 591 మందికి లైంగిక నేరాల కింద శిక్షలు ఖారారయ్యాయని తెలిపారు. ఈగల్ టీంను పెట్టాక నార్కోటిక్స్‌పై చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణలో కూడా ఇదే పేరుతో టీంను ఏర్పాటు చేసుకోవడం ఏపీకి గర్వకారణమన్నారు. గంజాయిని ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి డిస్ట్రాయ్ చేస్తున్నామని తెలిపారు. మొత్తం 2366 గంజాయి కేసులు నమోదవగా.. 986 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సైబర్ అరెస్ట్‌ల పేరుతో భయపెట్టి డబ్బులు కొట్టేస్తున్నారని.. సైబర్ నేరాలకు వ్యతిరేకంగా వార్‌రూం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి రూ.247 కోట్లు ఫ్రీజ్ చేశామన్నారు. 8 వేలకు పైగా చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ కంటెంట్‌ను తొలగించామని అనిత పేర్కొన్నారు.

# ఐదో డివిజన్‌లో పండగ వాతావరణం

**- డివిజన్ అధ్యక్షులు కే.గంగాధర్ ఆధ్వర్యంలో మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు - సత్యనారాయణపురంలో హోరెత్తిన సంబరాలు - కేక్ కట్ చేసి, భారీ అన్నదానం చేసిన ఐదో డివిజన్ టీడీపీ శ్రేణులు - ఐదో డివిజన్ వేడుకల్లో ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ రెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ పట్టాభి రామిరెడ్డి**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలో ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు పండగ వాతావరణంలో, అత్యంత వైభవంగా మిన్నంటాయి..ఐదో డివిజన్ సత్యనారాయణపురం ప్రాంతంలో డివిజన్ అధ్యక్షులు కే.గంగాధర్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, అభిమానులు ఈ సంబరాలను పండుగలా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి వర్యులు తాళ్లపాక రమేష్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి, పరస్పరం మిఠాయిలు తినిపించుకుంటూ నగర వ్యాప్తంగా పండుగ ఉత్సాహాన్ని నింపారు. మంత్రి నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టి పేద ప్రజల పట్ల తమకున్న సేవాదృక్పథాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా మాజీమంత్రి తాళ్లపాక రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి నారాయణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత అని, నవ్యాంధ్ర నిర్మాణంలో ఒక గొప్ప విజన్ ఉన్న అద్భుతమైన మహోన్నత నాయకుడు అని ఆకాశానికెత్తారు..ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ మహా సంబరంలో టీడీపీ సీనియర్ నాయకులు వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మంత్రి నారాయణ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ జేజేలు పలుకుతూ నెల్లూరు నగరాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఘనంగా మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలో బర్త్‌డే జోష్ కనిపిస్తోంది. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలను నగర ప్రజలు, కూటమి నాయకులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు డివిజన్లలో పండుగ వాతావరణం నడుమ కేక్ కటింగ్స్, సేవా కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. 45వ డివిజన్ రామ్మూర్తి నగర్ నడిబొడ్డున శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం సమీపంలో మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ డివిజన్ ఇన్‌ఛార్జ్ సుజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాధారణంగా రాజకీయ కార్యక్రమాలకు భిన్నంగా, ఈరోజు నారాయణపై ఉన్న అభిమానంతో రామ్మూర్తి నగర్‌లోని ప్రతి ఇంటా ఉన్న ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావడం విశేషం. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి తంబి సుజన్ కుమార్, పుత్త అజయ్, యశ్వంత్, చంద్రశేఖర్ రెడ్డి, రాఘవరెడ్డి, గోపాల్ రెడ్డి. చైతన్య, మహేష్, రాజారావ్, రాజేశ్వరి, సుశీల, లతా, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేదల ఆశాజ్యోతి మంత్రి నారాయణ

**- 6వ డివిజన్లో ఘనంగా మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు - శివాలయంలో ప్రత్యేక పూజలు పేదలకు అన్నదాన కార్యక్రమం : కొండ ప్రవీణ్ శంకర్, గుత్తా అన్నపూర్ణ**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక ఆరవ డివిజన్ అధ్యక్షులు కొండ ప్రవీణ్ శంకర్, ఐదు ఆరు డివిజన్లోకో క్లస్టర్ గుత్తా అన్నపూర్ణ నరహరి నాయుడు నేడు మున్సిపల్ శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలను పప్పులు వీధి పార్క్ శివాలయం వద్ద ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టి పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ నవ్యాంధ్ర నిర్మాణ శిల్పి ప్రగతి ప్రదాత మంత్రి నారాయణ అని నగర ప్రజల శ్రేయస్సు కోసం నగర అభివృద్ధి కోసం అలుపెరగకుండా శ్రమిస్తున్న మహానేత మంత్రి నారా యణ అని వారు ఇలాంటి పుట్టిన రోజులు నిండు నూరేళ్లు జరుపుకొని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తమ మనస్ఫూర్తిగా ఆ భగవంతుని కోరుకుంటున్నామని వారు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, యూనిటీ ఇన్చార్జి రాజ్యలక్ష్మి, బూత్ కన్వీనర్లు బిఎల్ఎలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రక్తదాత సుఖీభవ అవార్డు ప్రదానం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రక్తాన్ని తయారు చేయలేము, మార్కెట్టులో వస్తువులా కొనలేమని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రత్నమ్మ చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నెల్లూరులోని మినీ టౌను హాలునందు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కవిసమ్మేళనం, రక్తదాత సుఖీభవ అవార్డు ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పొలిటికల్ అనలిస్ట్ యనమల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదాలు, శస్త్ర చికిత్సలు, ప్రసవం వంటి సమయాల్లో రక్తం అవసరం అవుతుంది. అలాంటి వాళ్ళ ప్రాణాలు నిలిపేందుకు రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రక్తదాతలు పేరిశెట్ల వెంకటేశ్వర్లు, బిల్లా వంశీ కృష్ణ, దారా దినేష్ కుమార్, నాదెండ్ల చైతన్య, దొంతి సాయి నిఖిల్, పి.ధనశేఖర్‌లను 'రక్తదాత సుఖీభవ' అవార్డుతో శాలువా, మెడల్, దండ, మొమెంటో, ప్రశంసాపత్రం, కిరీట ధారణతో ఘనంగా సత్కరించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్ రాజు సభాధ్యక్షులుగా వ్యవహరించిన కార్యక్రమంలో దూర్జటి ప్రభాకర్, షేక్ రియాజ్ భాషా, యస్.వి. రమేష్ బాబు, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, డాక్టర్ రాచపాలెం రఘు, పవన్ కుమార్, కూని అంకబాబు, కృష్ణ ప్రసాద్, ఇసనాక దయాకర్ రెడ్డి, నగ్మా, కవులు, రక్త దాతలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలు ప్రతి పేదవారికీ అందడమే లక్ష్యం : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**- కేంద్ర పభుత్వ పథకాలపై విస్తృతస్థాయి అవగాహన కల్పించండి**

**- దిశ సమీక్షలో అధికారులకు కీలక ఆదేశాలిచ్చిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి అభివృద్ధి మరియు సంక్షేమ పథకం జిల్లాలోని ప్రతి పేదవారికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటి ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటి సమీక్షా సమావేశం నిర్వహించారు. నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెంకటగిరి శాసన సభ్యులు కురుగుండ్ల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాతతో కలసి జిల్లాలో అమలవుతున్న వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతిపై ఎంపీ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ఇప్పటికే ఆలస్యమైనందున వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ రైల్వే సీనియర్ డివిజన్ ఇంజనీర్‌కు సూచించారు. నెల్లూరు రైల్వే స్టేషన్ కాంట్రాక్టర్ ఆలస్యంగా పనులు చేసినందున వారిపై తగు చర్యలు తీసుకుని.. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ఇటీవలే మొదలు పెట్టామని 2027 మార్చికి పూర్తి చేస్తామని ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ ఇంజనీర్ ఎంపీకి వివరించారు.

# రెండేళ్లలో శాంతిభద్రతలు, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణలో గణనీయ పురోగతి

## - ప్రజా భద్రత, సైబర్ రక్షణ, విపత్తు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ విశిష్ట పురోగతి - సాంకేతికత, పారదర్శకత, జవాబుదారీతనంతో సమగ్ర సంస్కరణలు : రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి





**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల అరికట్టడం, విపత్తుల నిర్వహణ, జైళ్ల సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రయోజనాలకు పరిమితమైన వ్యవస్థలను ప్రజా సేవా దృక్పథంతో పునర్నిర్మిస్తూ, ప్రజలకు జవాబుదారీగా పనిచేసే పరిపాలనా వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ అనేది కేవలం అధికార ప్రదర్శన కాదని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే బాధ్యతగా ప్రభుత్వం విశ్వసిస్తోందని ఆమె తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, పోలీసు–ప్రజల సమన్వయం, సాంకేతికత వినియోగం, పారదర్శక పరిపాలన, వేగవంతమైన స్పందన, చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, నేరం జరగకుండా ముందుగానే నిరోధించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజల భద్రత, మహిళల గౌరవం, యువత భవిష్యత్తు, సమాజ శాంతి కోసం రాజీపడకుండా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అని మంత్రి స్పష్టం చేశారు.

**నేర నియంత్రణలో గణనీయ పురోగతి - 14.1 శాతం క్రైమ్ రేట్ తగ్గింపు...**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన నిఘా వ్యవస్థలు, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, అంతర్‌శాఖ సమన్వయాన్ని మెరుగుపర్చడం ద్వారా రాష్ట్రంలో మొత్తం నేరాల శాతం సుమారు 14.1 శాతం మేర తగ్గిందని మంత్రి తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విశ్లేషణ, డిజిటల్ నిఘా వ్యవస్థల ద్వారా ఇన్విజిబుల్ పోలీసింగ్‌ను అమలు చేస్తూ నేరాలను ముందుగానే గుర్తించి నిరోధించే దిశగా ప్రభుత్వం విజయవంతంగా ముందుకు అడుగులు వేసిందన్నారు. నేరస్థుల కదలికలను పర్యవేక్షించడం, ఆధారాలను వేగంగా సేకరించడం, విచారణలను వేగవంతం చేయడం ద్వారా శిక్షల శాతం పెరిగేలా చర్యలు చేపట్టబడుతున్నాయన్నారు.

**మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం...**

ఒక మహిళ అర్ధరాత్రి కూడా నిర్భయంగా వీధిలో నడవగలిగితేనే నిజమైన స్వాతంత్ర్యం సాధించినట్టే అనే భావనతో ప్రభుత్వం మహిళా భద్రతను అత్యంత ప్రాధాన్యతా అంశంగా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ లక్ష్యంతో మహిళా రక్షణకు ప్రత్యేక విభాగాల ఏర్పాటు, ప్రతి జిల్లాలో ప్రత్యేక భద్రతా వ్యవస్థలు, సాంకేతిక ఆధారిత స్పందన యంత్రాంగం, శక్తి యాప్ ద్వారా అత్యవసర సహాయం మరియు మహిళలపై నేరాలకు ప్రత్యేక పర్యవేక్షణ అమలు చేయబడుతున్నదన్నారు. శక్తి యాప్ ద్వారా ఇప్పటివరకు 11.15 లక్షలకు పైగా అత్యవసర ౹ూూ కాల్స్ అందాయని, వాటిపై తక్షణ చర్యలు కూడా తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు.

**ఆపరేషన్ ముస్కాన్ - వేలాది కుటుంబాల్లో మళ్లీ ఆనందం...**

తప్పిపోయిన చిన్నారులు, మహిళలు, వృద్ధులను గుర్తించి కుటుంబాలకు చేర్చేందుకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ అత్యంతంగా విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 8,396 మంది తప్పిపోయిన వ్యక్తులను గుర్తించి, వారి కుటుంబాలకు తిరిగి చేర్చడం జరిగిందన్నారు. ఈ విజయాలు పోలీసు శాఖ మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తున్నదని మంత్రి తెలిపారు.

**చిన్నారుల రక్షణలో రాజీలేని వైఖరి...**

పోక్సో కేసులను ప్రభుత్వం అత్యంత సున్నితమైన అంశంగా పరిగణిస్తూ చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని మంత్రి తెలిపారు. ప్రత్యేక దర్యాప్తు బృందాలు, వేగవంతమైన ఫోరెన్సిక్ పరీక్షలు, ప్రత్యేక ప్రాసిక్యూషన్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు బాధితులకు మానసిక, సామాజిక సహాయం అందించడం జరుగుచున్నదన్నారు. ఇప్పటి వరకు 2,293 మంది చిన్నారులకు కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించబడ్డాయని తెలిపారు.

**డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో చారిత్రాత్మక చర్యలు...**

గతంలో రాష్ట్రాన్ని తీవ్రంగా కలవరపరిచిన గంజాయి, మాదక ద్రవ్యాల సమస్యపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడం వల్ల మంచి ఫలితాలు కనిపించాయని మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన EAGLE ద్వారా అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల నెట్‌వర్కులపై దాడులు, గంజాయి సాగు నిర్మూలన, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా రక్షించే అవగాహన చర్యలు చేపట్టబడ్డాయన్నారు. ఫలితంగా 56,674 గంజాయి కేసులు నమోదు, 2,366 మందిపై చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు ?4 కోట్లకు పైగా విలువైన ఆస్తుల స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. జీరో గంజాయి సాగు లక్ష్యంతో సమగ్ర చర్యలు అమలులో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆమె పేర్కొన్నారు.

**సైబర్ నేరాలపై సాంకేతిక యుద్ధం...**

డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేస్తోందన్నారు. సైబర్ వార్ రూమ్స్ ఏర్పాటు, బ్యాంకులు, టెలికాం సంస్థలతో సమన్వయం, 1930 సైబర్ హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ మోసాలపై రియల్ టైమ్ స్పందన వంటి చర్యల ఫలితంగా సుమారు ?247 కోట్ల ప్రజల సొమ్మును మోసగాళ్ల బారిన పడకుండా రక్షించడం జరిగిందన్నారు. సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు కూడా విస్తృతంగా నిర్వహించబడుతున్నాయన్నారు.

**అత్యవసర సేవల్లో వేగవంతమైన స్పందన...**

ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం వారి వద్దకు చేరుకోవాలనే లక్ష్యంతో స్పందన వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించడం జరిగిందన్నారు. 2024లో సగటున 30 నిమిషాలుగా ఉన్న స్పందన సమయం ప్రస్తుతం 10 నిమిషాల లోపుకు తగ్గిందని తెలిపారు. అత్యవసర సేవలలో 97.47 శాతం సమర్థవంతమైన స్పందన రేటు నమోదు కావడం విశేషం అన్నారు.

**ఫోరెన్సిక్ రంగంలో సమగ్ర పునర్నిర్మాణం...**

శాస్త్రీయ దర్యాప్తుకు వెన్నెముకైన ఫోరెన్సిక్ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. జనవరి నుండి మే వరకు 7,793 కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణలు పూర్తి చేయబడ్డాయన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోరెన్సిక్ ప్రయోగశాలలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**రోడ్డు భద్రత - ప్రాణనష్టాల తగ్గింపే లక్ష్యం...**

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, సీసీటీవీ పర్యవేక్షణ, ట్రాఫిక్ అమలు బలోపేతం తదితర చర్యలు చేపట్టడంతో ప్రమాదాల తీవ్రత తగ్గుముఖం పట్టిందని మంత్రి తెలిపారు.

**పోలీసు సంక్షేమంలో చారిత్రక నిర్ణయాలు...**

పోలీసు సిబ్బంది సంక్షేమం లేకుండా సమర్థవంతమైన శాంతి భద్రతలు సాధ్యం కాదనే భావనతో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. 6,000 మందికి పైగా పోలీసు నియామకాలు, 505 మంది గెజిటెడ్ అధికారులకు పదోన్నతులు, కానిస్టేబుల్ శిక్షణార్థుల స్టైపెండ్‌ను 4,000 నుండి 7,500కు పెంపు చేయడం జరిగిందన్నారు. ఇందు కోసం 7.5 కోట్ల అదనపు నిధుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు.

**జైళ్లను సంస్కరణ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం...**

జైళ్లు కేవలం శిక్షా కేంద్రాలు మాత్రమే కాకుండా పునరావాస కేంద్రాలుగా మారాలనే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి శిక్షణ, మానసిక ఆరోగ్య సేవలు, డీ–అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ఖైదీలు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతోందన్నారు.

**విపత్తు నిర్వహణలో దేశానికే ఆదర్శం...**

గత రెండేళ్లలో విపత్తు నిర్వహణ వ్యవస్థను పూర్తిగా పునర్వ్యవస్థీకరించడం జరిగిందని మంత్రి తెలిపారు. 26 NDRF బృందాలు, 22 SDRF బృందాలు, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా ప్రాణనష్టం తగ్గించే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 872 మంది రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించబడ్డాయన్నారు.

**అగ్నిమాపక సేవలు - స్పందన నుంచి నివారణ దిశగా...**

అగ్నిప్రమాదాల సమయంలో వేగవంతమైన స్పందనతో పాటు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అత్యాధునిక పరికరాలు, సాంకేతిక సదుపాయాలతో అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

**సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ - నేరస్థులకు కఠిన శిక్షలు...**

నేరస్థులకు శిక్షలు ఖరారయ్యేలా ప్రాసిక్యూషన్ వ్యవస్థను బలోపేతం చేయడంతో 279 కీలక కేసుల్లో విజయవంతమైన తీర్పులు, 8 మందికి మరణదండన, 3 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, 42 మందికి 20 సంవత్సరాలకు పైగా శిక్ష, 14 మందికి 14 సంవత్సరాల జైలు శిక్ష విధించబడ్డాయని మంత్రి తెలిపారు. అదనపు డిజి మదుసూధన రెడ్డి, హోం శాఖ ప్రిన్సిఫల్ సెక్రటరీ కుమార విశ్వజిత్, ఎస్.పి.ఎఫ్. డిజి డా.త్రివిక్రమ వర్మ, హోం శాఖ స్పెషల్ సెక్రటరీ విజయకుమార్, ఈగల్ ఛీఫ్ ఐజి రవికృష్ణ, ఐజిలు శ్రీకాంత్, రాజకుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ఎండి ప్రకర్ జైన్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వెంకట రమణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఏ.పి. ఫిలిం, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ తొలి డైరెక్టర్ల సమావేశం

## - చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కార్యాచరణ దిశగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ తొలి బోర్డు సమావేశం - ఏ.పి. ఫిలిం, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్.విశ్వనాథన్




**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించే దిశగా ఏపీ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నూతన పాలకవర్గం తొలి బోర్డు సమావేశం సోమవారం విజయవాడ ఫార్చ్యూన్ మురళి పార్క్ హోటల్‌లో విజయవంతంగా నిర్వహించామని మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్ తెలిపారు. సమావేశానికి కార్పొరేషన్ ఛైర్మన్ పి.భరత్ భూషణ్ అధ్యక్షత వహించగా, మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్, డైరెక్టర్లు వై. ఝాన్సీ, సుమన్ తల్వార్, ఎస్. శివాజీ, చదలవాడ శ్రీనివాసరావు, బుర్రా సాయి మాధవ్, కందిమళ్ల సాంభశివరావు, వివేక్ కూచిభొట్ల, వి.సముద్ర, కే.ఉమామహేశ్వరరావు, ఎస్. వెంకట కృష్ణా రెడ్డి, జి.రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి.సత్యనారాయణ, దుర్గా ప్రసాద్ సాహులు హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగాల సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చించారు. బోర్డు డైరెక్టర్ల సభ్యుల్లో ఒకరు చిక్కాల మెహర్ రమేష్ కుమార్‌ను ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసే ప్రక్రియను పూర్తి చేశామన్నారు. బోర్డు సమావేశానంతరం ఈజీఎమ్ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు, పెట్టుబడుల ఆకర్షణ, చిత్రీకరణకు అనుకూల వాతావరణం కల్పించడం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ (రూట్ మ్యాప్) రూపొందించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

గతంలో ప్రకటించిన నంది అవార్డులు, భవిష్యత్తులో నిర్వహించాల్సిన నంది అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివిధ అంశాలు, విధివిధానాలు, సూచనలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించామన్నారు. రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమను మరింత బలోపేతం చేయడంతో పాటు కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలకు ప్రోత్సాహం అందించేలా కార్పొరేషన్ కార్యాచరణ కొనసాగుతుందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారని మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తెలియజేశారు. ఈ సమావేశంలో ఏ.పి. ఫిలిం, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముడావత్ శ్రీనివాస్ నాయక్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రియాక్షన్




**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏపీ హోంమంత్రి అనిత గురించి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిం చాల్సినవే అని చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని.. కానీ మహిళలను అవమానించేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఒక మహిళా మంత్రిని 'మేకప్ మంత్రి' అని సంబోధించడం ఆమెను మాత్రమే కాదు, మహిళలందరినీ అవమానించినట్టే అని మండిపడ్డారు.

**వ్యక్తిగత దూషణలు సరికాదు..**

మహిళల రూపం, దుస్తులు, మేకప్ గురించి మాట్లాడటం రాజకీయ విమర్శ కాదని...అది మహిళల గౌరవాన్ని కించపరచడమే అని శైలజ వ్యాఖ్యానించారు. ఒక మహిళను ఆమె రూపాన్ని బట్టి కాదని, ఆమె పనితీరు, సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మరింత బాధాకరమన్నారు. రాజకీయ విభేదాలు ఉంటే విధానాలపై చర్చించాలి గానీ, వ్యక్తిగత దూషణలకు దిగకూడదన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతాయన్నారు.

**ఈ వ్యాఖ్యలను సమాజం అంగీకరించదు..**

మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ గురించి దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న ఈ సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అత్యంత విచారకరమని రాయపాటి శైలజ అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మరింత మంది మహిళలు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తిని దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న ఈ సమయంలో వారిని నిరుత్సాహపరిచే వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా రాజకీయంగా ఎవరూ ఎదగలేరన్నారు. నైతిక విలువలు, సంస్కారం లేనివారు ఎప్పటికీ నిజమైన నాయకులు కాలేరని అన్నారు. మహిళల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజా జీవితంలో ఉన్నవారికి ఆ బాధ్యత మరింత ఎక్కువ అని చెప్పుకొచ్చారు. ఇలాంటి వ్యాఖ్యలను మహిళా సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఈ వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గుడివాడ అమర్‌నాథ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని రాయపాటి శైలజ డిమాండ్ చేశారు.

**మహిళా కమిషన్ సీరియస్..**

హోమ్ మంత్రి అనితను కించపరిచే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. అమర్‌నాథ్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీకి కమిషన్ లేఖ పంపనుంది. అదేవిధంగా.. గుడివాడ అమరనాథ్‌కు సమన్లు ఇవ్వాలని మహిళా కమిషన్ నిర్ణయించింది. కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడమే గాకుండా సమర్థించుకునే విధంగా మాట్లాడుతున్నారని మహిళ కమిషన్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఊరిలో లేకపోవడంతో రేపు (బుధవారం) సమన్లు పంపాలని నిర్ణయించింది.

# సంపాదకీయం

## పాలకులు చేసే 'రాజభోగపు' ఖర్చులు - ప్రజలకు మాత్రం 'మితవ్యయం'పై నీతులు!

ప్రజాస్వామ్యంలో, పాలకులు చెప్పేదానికి మరియు చేసేదానికి మధ్య పొంతన లేకపోవడం కొత్తేమీ కాదు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, ప్రజల దృష్టిని మళ్లించడం మరియు మోసపూరిత వాగ్దానాలు చేయడం సర్వసాధారణమైపోయాయి. అయితే, ప్రభుత్వాల ప్రస్తుత ఆర్థిక నిర్వహణ మరియు విలాసవంతమైన జీవనశైలి సామాన్య పౌరులను విస్మయానికి గురిచేస్తున్నాయి. రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతోందని, అప్పుల భారం పెరుగుతోందని హెచ్చరిస్తూనే, మరోవైపు ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేసే సంస్కృతి పాతుకుపోయింది. విచిత్రమేమిటంటే, వేదికెక్కినప్పుడు మాత్రం ఇదే పాలకులు ఆర్థిక క్రమశిక్షణ (మితవ్యయం) గురించి ఉపన్యాసాలు ఇస్తూ, ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మరియు సకాలంలో పన్నులు చెల్లించాలని కోరుతుంటారు. చార్టర్డ్ విమానాలు మరియు 'జర్మన్ షెడ్ల' విలాసం: సాధారణ ప్రయాణాలకు కూడా ప్రత్యేక చార్టర్డ్ విమానాలు మరియు హెలికాప్టర్లను బుక్ చేసుకోవడం నేటి రాజకీయ నాయకులకు ఒక హోదా చిహ్నంగా మారింది. విమాన ప్రయాణానికి కోట్ల ఖర్చు: రాజకీయ పర్యటనలు లేదా కేవలం కొన్ని గంటల పాటు సాగే వ్యక్తిగత కార్యక్రమాల కోసం విమానయాన సంస్థలకు ప్రజాధనం కోట్లాది రూపాయలు ధారపోస్తున్నారు. కొందరు ఉన్నతాధికారులు ఒకటి కంటే ఎక్కువ కార్లను వినియోగించడం ద్వారా అనవసరమైన ఖర్చును పెంచుతున్నారు. ప్రజా సభలపై వృథా ఖర్చు: ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవాలు లేదా రాజకీయ ర్యాలీల విషయానికొస్తే, ఆ విలాసానికి అంతు లేకుండా పోతోంది. వర్షం లేదా తీవ్రమైన ఎండలో కూడా వేదిక చెక్కుచెదరకుండా ఉండేలా 'జర్మన్ షెడ్లు' మరియు వాటర్‌ప్రూఫ్ టెంట్ల ఏర్పాటు కోసం ఒక్కో కార్యక్రమానికి కోట్లాది రూపాయల కాంట్రాక్టులు ఇస్తున్నారు. కేవలం కొన్ని గంటల పాటు మాత్రమే ఉండే ఈ తాత్కాలిక నిర్మాణాల కోసం వెచ్చించే నిధులతో వందలాది ప్రభుత్వ పాఠశాలలు లేదా ఆసుపత్రులను ఆధునీకరించవచ్చు. ప్రజలపై భారం... కానీ అధికారంలో ఉన్నవారికి మాత్రం ఎలాంటి నియమాలు లేవు! అధికారంలో ఉన్నవారి ఖర్చులు ఆకాశాన్ని తాకుతుండగా, సామాన్య పౌరుడిపై మాత్రం భరించలేని భారం పడుతోంది.

1. రాయితీల కోత: సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించడం మరియు నిత్యావసర వస్తువులపై రాయితీలను తొలగించడం సర్వసాధారణమైపోయింది.

2. పన్నుల పెంపు: ఇంధన ధరలు, విద్యుత్ ఛార్జీలు మరియు రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు ద్వారా ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

3. మితవ్యయంపై నీతులు: ఆర్థిక సంక్షోభాన్ని నివారించడానికి 'మితవ్యయం' పాటించాలని మరియు ఉచిత పథకాల ఆశను వదులుకోవాలని ప్రజలకు హితబోధ చేయడానికి ఐఏఎస్ అధికారులు, మంత్రులు మరియు ప్రజాప్రతినిధులు తరచుగా విలేకరుల సమావేశాలు నిర్వహిస్తుంటారు. నేటి ప్రభుత్వాల ప్రజాస్వామ్య-వ్యతిరేక వైఖరి ఇలా చెబుతున్నట్లు అనిపిస్తుంది: "మా ఖర్చులకు ఎలాంటి పరిమితులు లేవు... కానీ మీరు మాత్రం బడ్జెట్ పరిమితిని దాటకూడదు."

**జవాబుదారీతనంలో మార్పు రావాలి**

ప్రజాధనం అనేది ప్రజలు తమ కష్టార్జితంతో చెల్లించే పన్నుల ద్వారా సమకూరే సంపద. ఈ డబ్బును విలాసాల కోసం వృథా చేసే హక్కు ఏ పాలకుడికీ లేదు-అలాంటి హక్కు వారికి ఎప్పటికీ ఉండకూడదు. ప్రభుత్వాలు నిజంగా ఆర్థిక క్రమశిక్షణను పాటించాలనుకుంటే, ఆ మార్పు "అగ్రస్థాయి" నుండే మొదలవ్వాలి. మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రయాణ ఖర్చులు మరియు అధికారిక సమావేశాల వ్యయాలపై స్పష్టమైన పరిమితులు (మితవ్యయ నిబంధనలు) విధించాలి. పర్యవేక్షణ కోసం స్వతంత్ర ఆడిటింగ్ వ్యవస్థ కూడా ఉండాలి. తనిఖీలు నిష్పక్షపాతంగా జరగాలి. అధికారంలో ఉన్నవారి విలాసవంతమైన జీవనశైలికి, సామాన్యుడి దుర్భర పరిస్థితులకు మధ్య వ్యత్యాసం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రజలకు మితవ్యయం గురించి బోధిస్తూనే, వారి కళ్ల ముందే కోట్లాది రూపాయలను వృథా చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. ప్రభుత్వాలు ఈ ఆడంబరాన్ని అరికట్టి, కఠినమైన మితవ్యయ చర్యలను-ఈ దశలోనైనా-అవలంబించకపోతే, 'జెన్-జెడ్' వంటి యువత ఈ ద్వంద్వ ప్రమాణాలకు వ్యతిరేకంగా తీవ్ర తిరుగుబాటు చేసే రోజు ఎంతో దూరంలో లేదు.

## వైసిపి రాష్ట్ర కార్యదర్శి గొల్లపల్లి డేవిడ్‌కు సత్కారం

**అమలాపురం, (రాజధాని వార్తలు):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్‌ను వైయస్సార్ సిపి అధిష్టానం రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. డేవిడ్‌ను రాష్ట్ర కార్య దర్శిగా నియమించిన సందర్భంగా కొత్తపేటలోని డేవిడ్ స్వగృహంలో ఆదివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు దుశ్శాలువాలు కప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేసి పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకు వచ్చేందుకు పాటు పడదామని రమణారావు ఈ సందర్భంగా అన్నారు. డేవిడ్‌ను అభినందించిన వారిలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, ఎంపీ కుమార్, పరమట రాజశేఖర్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, కొత్తపేట మండల విద్యా విభాగం అధ్యక్షుడు నేరేడుమెల్లి నరేష్, దాసరి అంజి తదితరులు ఉన్నారు.

# పెండింగ్ అక్రిడిటేషన్ల జారీకి వినతి

### - సానుకూలంగా స్పందించిన అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్
### - ధన్యవాదాలు తెలిపిన జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** సమాచార శాఖ రికార్డులలో హాజరు కాస్త తక్కువయ్యి పెండింగ్‌లో స్మాల్ దినపత్రికల అక్రిడేషన్లను జారీ చేయాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సోమవారం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయా పత్రికలను క్రమం తప్పకుండా ముద్రిస్తున్నప్పటికీ పట్నానికి డిపిఆర్ ఓ ఆఫీస్ కొంచెం దూరంగా ఉండటంతో పత్రికలు అందజేతలో సాంకేతిక సమస్యను ఎదుర్కొంటున్నామని కలెక్టర్‌కు తెలిపారు. సంవత్సరానికి పూర్తి హాజరకు కాస్త తక్కువ కావడం వల్ల అక్రిడేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, హాజరు నమోదు కానీ తేదీలకు అనుమతినిస్తే ఆయా పత్రికల కాపీలను అందజేస్తామని కలెక్టర్ ను కోరారు. దానిపై స్పందించిన కలెక్టర్ ఈసారికి అనుమతినిస్తామని హాజరు నమోదు కానీ తేదీల పత్రికల కాపీలను డిపిఆర్‌ఓలో అందజేయాలని ఆదేశాలు ఇచ్చారు. వాటిని పరిగణలోకి తీసుకోవాలని డిఆర్‌ఓకి సూచనలిచ్చారు. దీనిపై జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జోగి నాయుడు, ప్రధాన కార్యదర్శి, డిఎం ఎసి సభ్యుడు కోరాడ చంద్రరావు, డిఎంఏసి సభ్యుడు గిరిబాబు, విశాఖ జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు, డిఎంఏసీ సభ్యుడు కె.రాము, ఏపీజేఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, డిఎంఎసి సభ్యుడు యర్రా నాగేశ్వరరావు, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, విశాఖ డిఎం ఏసి బి.శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టులు టి.రమేష్, సంతోష్ కుమార్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో 50% రాయితీ

### - తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు - ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి నివేదిస్తా - తెల్ల రేషన్ కార్డుదారులకు ఆరోగ్య భీమా ప్రీమియం చెల్లింపు : జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు స్కూల్స్ కళాశాలల ఫీజులో 50% రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లు సంయుక్తంగా జిల్లా కలెక్టర్ అభిసిక్త్ కిషోర్‌కు వినతి పత్రం సమర్పించాయి. సోమవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలుసుకుని జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. 2014 నుంచి జర్నలిస్టుల పిల్లలకు కొన్ని సందర్భాల్లో 100% మరికొన్నిసార్లు 50% స్కూల్ ఫీజు రాయితీ ఇస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. గత ఏడాది అప్పటి కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను పరిశీలించిన అనంతరం వెంటనే ఈ ఏడాదికి సంబంధించి కూడా అవసరమైన ప్రొసీడింగ్స్ జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే జర్నలిస్టులకు సంబంధించిన ఇళ్ల స్థలాలు సమస్యను కూడా వివరించగా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆరోగ్య బీమాకు సంబంధించి తెల్లరేషన్ కార్డుదారులకు వెటరన్ జర్నలిస్టులకు సి ఎస్ ఆర్ నిధులతో ప్రీమియం చెల్లిస్తామన్నారు. పెన్షన్ సదుపాయం ప్రమాద బీమా పునరుద్ధరణ వంటి అంశాలను వినతి పత్రం ద్వారా కలెక్టర్ కు తెలియజేశామని గంట్ల శ్రీనుబాబు చెప్పారు. జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజు రాయితీ ఉత్తర్వులు వెంటనే జిల్లా విద్యాశాఖ ద్వారా జారీకానున్నట్లు చెప్పారు. ఇతర సమస్యలు పరిష్కారానికి తమ యూనియన్ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి జి. శ్రీనివాస్ రావు ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, ఉపాధ్యక్షులు శివప్రసాద్ నగేష్, కృష్ణమూర్తి బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, మదన్, స్మాల్ పేపర్స్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్, శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బొబ్బర్ ప్రసాద్, ఆనంద్, అరుణ్ భాస్కర్, రాజశేఖర్, చంద్రశేఖర్, సత్యనారాయణ, అప్పలనాయుడు, భాస్కర్, డివిఎస్ రెడ్డి, సతీష్, కృష్ణమూర్తి, రమేష్, గౌతమ్, వినయ్, రమణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఐలా ఛైర్మన్‌గా యార్లగడ్డ గెలుపుపై తెలుగు శక్తి హర్షం : తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్



**విశాఖ, గాజువాక, (రాజధాని వార్తలు):** నువ్వా నేనా అంటూ ఉత్కంఠ భరితంగా సాగిన ఐలా ఎన్నికల్లో ఐలా చైర్మన్‌గా యార్లగడ్డ సాంబశివరావు గెలుపుపై తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆటో నగర్, గాజువాకలో యార్లగడ్డ సాంబశివరావును కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ అందర్నీ కలుపుకొని ఐలాను అభివృద్ధి వైపు నడిపించాలని అలాగే ఇక్కడ పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా మీ ద్వారా పరిష్కారం జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని అన్నారు. యార్లగడ్డను కలిసిన వారిలో వై.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎస్.పాండురంగ ప్రసాద్, డి.వి.ఎస్. రాంబద్ర రాజు, పి.ప్రభాకర్, ఎస్.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, బొల్లినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులకు ఫిట్నెస్ పరిశీలించాలి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలలు పునః ప్రారంభం కావడం వలన ప్రైవేట్ పాఠశాలలో నడిపే బస్సులు అన్నిటికీ ఫిట్నెస్ సర్టిఫికెట్ ఉండేలా, బస్సులు కండిషన్‌లో ఉండే విధంగా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. సోమవారం ఆయన ఆర్డీవోను కలసి మాట్లాడుతూ పాఠశాలలు నడుపుతున్న బస్సులు కొన్ని రిపేరులతో ఉండటంతో పాటు సీట్లు సరిగ్గా లేకపోవడంతో పిల్లల ఇబ్బందులు పడుతునట్టు మా దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు తనిఖీలు చేసి కండిషన్‌లో లేని బస్సులను నిలుపుదల చేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరారు. అలాగే ఆటోలో పిల్లల్ని తీసుకెళ్లటం ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలకు నడుపుతున్నారు. కానీ పరిమితకు మించి ఎక్కువ మంది పిల్లలను ఎక్కించడం వలన అనేక ప్రమాదాలు గురవుతున్నాయని, అందువలన ఆటోలలో ఎక్కే పిల్లలను పరిమితకు మించి ఎక్కకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మరి ముఖ్యంగా ట్రాన్స్పోర్ట్ అధికారులు పోలీసు అధికారులు తరచూ తనిఖీలు చేసి బస్సులు అన్ని రికార్డులతో కండిషన్‌లతో ఉండేలాగనా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నాము. సోమవారం నుండి అన్ని పాఠశాలలు నడుపుతున్నారు కాబట్టి బస్సులు నడుస్తాయి కాబట్టి తక్షణ చర్యలు తీసుకుని పిల్లలకి ప్రాణరక్షణ కల్పించాలని జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం తరపున కోరారు.

# జీవన ఎరువులతో భూసారం పెంపు

### - తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు శ్రీనుబాబు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగిస్తూ, సేంద్రియ మరియు జీవన ఎరువుల వాడ కాన్ని పెంచడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవాలని కాకినాడ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు చౌదరి (శ్రీనుబాబు) అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఖరీఫ్ సన్నాహక అభియాన్ - కేత్ బచావో అభియాన్" కార్యక్రమంలో భాగంగా జి.మేడపాడు గ్రామంలో రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయం, జీవన ఎరు వులు, సేంద్రియ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా భూమి ఉత్పాదకతను దీర్ఘకాలికంగా పెంచుకో వచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.మురళీధర్ మాట్లాడుతూ ఐదు ప్రధాన అంశాలపై రైతులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహం, ఎల్‌నినో ప్రభావంపై అవగాహన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాల ప్రచారం, ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతు గుర్తింపు సంఖ్య అందజేయడం వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, పెద్దబ్రహ్మదేవం పీఏసీ ఎస్ మాజీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, జి. మేడపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు పాలకుర్తి వీర భావనారాయణ (రవిబాబు), సొసైటీ ప్రతినిధులు జానా వెంకట్రావు, పాలచర్ల వీర్రాజు, నీటి సంఘం అధ్యక్షుడు గోర్ల్ కృష్ణమూర్తి, టిడిపి నాయకుడు గోలి తమ్మిరాజు, అందుగుల జార్జి చక్రవర్తి, సొసైటీ సీఈఓ ఎం. శ్వేత, ఏఈఓలు కమలరూప, వీఏఏలు దినేష్, నాయుడు, మణికంఠ, శ్రీనివాసు, ప్రవీణ్, సొసైటీ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# ఎస్సీలుగా గుర్తించాలంటూ నిరసన




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** దళిత క్రైస్తవులను వెంటనే ఎస్సీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం పట్టణంలో పాస్టర్స్ అండ్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు వారి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ, ఎంఆర్ఓలకు అందజేశారు. తొలుత పట్టణంలో పాస్టర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ అంశంపై గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీర్మానాలు చేసి పంపినా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రంగనాథ్ మిశ్రా, బాలకృష్ణ కమిషన్లు వేసి కేంద్ర ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని విమర్శించారు. దేశంలో కుల వ్యవస్థ నైనా పూర్తిగా రద్దు చేయండి, లేదా మాకు ఎస్సీ హోదా అయినా ఇవ్వండి అంటూ వారు డిమాండ్ చేశారు. గుడికి వెళ్లే అన్నకు ఎస్సీ హోదా, చర్చికి వెళ్లే తమ్ముడికి బీసీ-సీ హోదా ఇవ్వడం దారుణమన్నారు. చర్చిలకు వెళ్లే ఉద్యోగుల ఫోటోలు తీసి, వారి ఎస్సీ సర్టిఫికెట్లు, ఉద్యోగాలు రద్దు చేస్తామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉండి రఘురామకృష్ణం రాజు బెదిరింపు ధోరణిలో మాట్లాడటం సరికాదన్నారు. సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే చినరాజప్పలకు మా సమస్య తెలుసునని, వారి మద్దతు మాకు ఉందని వారన్నారు. దళిత క్రైస్తవుల పట్ల కేంద్రం వివక్ష వీడి, వెంటనే క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

# పదోన్నతులకు నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలి




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు వేగంగా వస్తున్నాయని, ఉద్యోగులు అందుకు తగిన విధంగా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని సామర్లకోట విస్తరణ శిక్షణ ప్రిన్సిపల్ కెఎన్వి ప్రసాదరావు పిలుపునిచ్చారు. వివిధ జిల్లాలకు చెందిన గ్రేడ్-4, గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శిక్షణ ద్వారా ఉద్యోగుల పనితీరు మెరుగు పడుతుందన్నారు. అలాగే పంచాయతీరాజ్‌లోని అన్ని స్థాయిల్లో ఉద్యోగుల మధ్య ఐక్యత, సహకారం మెరుగుపడాలని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణార్థులకు శిక్షణ సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ జి రమణ, ఈటీసీ ఫ్యాకల్టీ సభ్యులు శేషుబాబు, చిన్నబ్బులు, నిహారిక, రాజశ్రీ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

# కేస్ స్టడీ సరే కానీ.. ఇలాంటి సినిమా తీసేదెప్పుడు ఆర్జీవీ?



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఒకప్పుడు సెన్సేషనల్ డైరెక్టర్‌గా, ట్రెండ్ సెట్టర్‌గా వెలిగిన రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) ఇటీవలి కాలంలో పూర్తిగా సినిమా రేస్ నుంచి తప్పుకున్నారనే అపవాదును మూటగట్టుకున్నారు. ఆర్జీవీ కంటే టెక్నికల్‌గా చాలా వెనకబడి ఉన్న దర్శకులు కూడా హిట్లు కొట్టి రేసులోకి దూసుకుపోతుంటే ఆర్జీవీ మాత్రం ఇంకా ఇంకా వెనక్కి వెళుతున్నారు. కథ కంటెంట్ లేని నాశిరకం సినిమాలతో తన విలువైన సమయాన్ని, ప్రతిభను దుర్వినియోగం చేస్తున్నారనే కలత ఆయన అభిమానుల్లో ఉంది. శివ, సత్య, కంపెనీ వంటి క్లాసిక్స్‌ను అందించిన ఆర్జీవీ నుంచి ప్రేక్షకులు ఇప్పటికీ ఒక బలమైన కంబ్యాక్ చిత్రాన్ని ఆశిస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఆర్జీవీ ఒక హాలీవుడ్ చిత్రంపై విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తూ వార్తల్లో నిలిచారు. కేవలం 7 కోట్ల రూపాయల (750,000 డాలర్లు) అతి తక్కువ బడ్జెట్‌తో రూపొంది ప్రపంచ వ్యాప్తంగా ఏకంగా 2000 కోట్ల రూపాయలకు (229.3 మిలియన్ డాలర్లు) పైగా వసూళ్లను సాధించిన హాలీవుడ్ హర్రర్ థ్రిల్లర్ చిత్రం అబ్సెషన్ కేస్ స్టడీతో వర్మ ప్రేమలో పడిపోయారు. ఇటీవలే ఆయన ఆదిత్యా ధర్ దురంధర్, దురంధర్ 2 చిత్రాలకు బోలెడంత ప్రచారం కల్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే రీతిలో అబ్సెషన్ సినిమా సక్సెస్ ఫార్ములాను, దాని కలెక్షన్ల వివరాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ ఉచిత ప్రచారం కల్పించడాన్ని సినీ వర్గాలు ఆసక్తిగా చర్చిస్తున్నాయి. వర్మ షేర్ చేసిన అబ్సెషన్ బడ్జెట్ కేస్ స్టడీ నిజంగానే అత్యంత ఆశ్చర్యకరంగా ఉంది. ఈ సినిమాలో నటించిన ప్రధాన నటి ఇండే నవరెట్‌కు కేవలం 19.07 లక్షలు, సహాయ నటీనటులకు 9.53 లక్షలలోపే పారితోషికం ఇచ్చారు. సాంకేతిక నిపుణుల విభాగంలో ఆర్ట్ డైరెక్టర్ శాలీ చోయ్‌కి రోజుకు కేవలం రూ.28,605 చొప్పున మొత్తం 5.28 లక్షలు మాత్రమే చెల్లించారు. దర్శకుడు కర్రీ బార్కర్ సైతం ముందస్తుగా కనీస వేతనం మాత్రమే తీసుకుని,.. లాభాల్లో వాటా (ఈక్విటీ) ఒప్పందం చేసుకున్నారు. మిగిలిన క్రూ మెంబర్స్, వాలంటీర్లకు కేవలం పెట్రోల్ అలవెన్సులు మాత్రమే ఇచ్చి ఈ సినిమాను పూర్తి చేయడం విశేషం. ఈ లో-బడ్జెట్ చిత్రం సృష్టించిన బాక్సాఫీస్ లాభాల సునామీ హాలీవుడ్‌ను సైతం షేక్ చేసింది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఫోకస్ ఫీచర్స్ ఈ సినిమాను 143.03 కోట్లకు ఫ్లాట్ డీల్ కింద కొనుగోలు చేసి... థియేట్రికల్ రిలీజ్ ద్వారా సుమారు 1,192 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అలాగే ఈ ప్రాజెక్ట్‌ను నమ్మిన ఫైనాన్షియర్ క్యాప్‌స్టోన్‌కు 429 కోట్ల నుండి 476 కోట్ల వరకు... ప్రముఖ నిర్మాత జేసన్ బ్లమ్ (బ్లమ్‌హౌస్) కు 162.10 కోట్ల మేర లాభాలు వచ్చాయి. ఇక ముందస్తుగా తక్కువ మొత్తం తీసుకున్న దర్శకుడు కర్రీ బార్కర్‌కు బాక్స్ ఆఫీస్ బోనస్‌లు, ఫెస్టివల్ సేల్ కట్స్ అన్నీ కలుపుకుని దాదాపు 14.30 కోట్ల నుండి 38.14 కోట్ల వరకు భారీ ఆదాయం సమకూరింది. ఆర్జీవీ విశ్లేషించిన ఈ కేస్ స్టడీ వినడానికి - చదవడానికి అద్భుతంగా ఉన్నా.. ఆయన ఉత్సాహాన్ని అర్థం చేసుకున్న అభిమానులు మాత్రం వర్మను ఒకే ప్రశ్న అడుగుతున్నారు. ఇలాంటి మైండ్ బ్లోయింగ్ కేస్ స్టడీలను ప్రచారం చేయడం పక్కన పెట్టి.. ఆర్జీవీ స్వయంగా ఇలాంటి ఒక లో-బడ్జెట్ కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాను ఎప్పుడు తీస్తారని ప్రశ్నిస్తున్నారు.

సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలు, అపారమైన అవగాహన ఉన్న ఆర్జీవీ లాంటి దర్శకుడు ఇకనైనా తన సమయాన్ని వృథా చేసుకోకుండా.. నాశిరకం కథలకు, వివాదాస్పద పబ్లిసిటీలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. అబ్సెషన్ తరహాలోనే ఒక వినూత్నమైన ప్రయోగాత్మక సినిమాను తీసి భారీ హిట్ కొట్టి తనేంటో మళ్లీ నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అభిమానులు గట్టిగా కోరుకుంటున్నారు. అబ్సెషన్ బడ్జెట్‌తో ఐస్ క్రీమ్‌లాంటి సినిమాలు తీయడం కాదు.. కచ్చితంగా అబ్సెషన్ రేంజు సినిమానే తీయాలి ఆర్జీవీ అంటూ కౌంటర్లు కూడా వేస్తున్నారు.

# సాయి పల్లవి ఓకే.. మరి ఆలియా సంగతేంటి?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్‌లో టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. మైథాలజీ బ్యాక్ డ్రాప్‌ను సైన్స్ ఫిక్షన్‌తో మిక్స్ చేసి రూపొందించిన ఆ విజువల్ వండర్‌కు నేషనల్ వైడ్‌గా ప్రేక్షకుల నుంచి సూపర్ రెస్పాన్స్ లభించింది. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న కల్కి-2పై కూడా అదే రేంజ్‌లో అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. అయితే మూవీ స్టోరీ, పాత్రల కంటే ఎక్కువగా కొత్తగా ఎవరు ఆ ప్రాజెక్టులో భాగమవుతున్నారనే విషయమే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ పేరు తాజాగా తెరపైకి రావడం ఆసక్తిని పెంచుతోంది. ఆలియా భట్ కల్కి-2లో కీలక పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే నెట్టింట వైరల్ అయిన వార్తల్లా ఆమె ఫస్ట్ పార్ట్‌లో మరో బీటౌన్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె పోషించిన సుమతి పాత్ర చేయడం లేదని తెలుస్తోంది. మూవీలో కీలక మలుపు తీసుకొచ్చే ఓ పవర్ ఫుల్ స్పెషల్ రోల్ కోసం ఆమెను సెలెక్ట్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఆలియా ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన కొంత భాగం షూటింగ్‌ను కూడా పూర్తి చేసిందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే దీనిపై మూవీ యూనిట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అఫీషియల్ అనౌన్స్మెంట్ రాలేదు. దీంతో ఆ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మరోవైపు, దీపికా పదుకొణె ప్లేస్ లో స్టార్ హీరోయిన్ సాయి పల్లవి నటించబోతున్నారనే వార్తలు రీసెంట్‌గా వినిపించాయి. అయితే ఆ ప్రచారానికి దర్శకుడు నాగ్ అశ్విన్ రీసెంట్‌గా చెక్ పెట్టారు. సాయి పల్లవి ఎంట్రీపై వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. దీంతో ఇప్పుడు ఆలియా భట్ విషయంలో అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అదే సమయంలో బ్లాక్ బస్టర్ హిట్ మూవీ ఆర్‌ఆర్‌ఆర్‌తో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన ఆలియా భట్, నిజంగానే కల్కి 2లో భాగమైతే సినిమాపై అంచనాలు మరింత పెరగడం ఖాయమని సినీ ప్రియులు, అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి భారీ క్యాస్టింగ్‌తో రూపొందుతున్న ఆ సీక్వెల్‌కు మరో స్టార్ యాడ్ అయితే పాన్ ఇండియా స్థాయిలో మరింత క్రేజ్ దక్కే అవకాశం ఉంది.

అయితే ప్రస్తుతం వినిపిస్తున్న వార్తలన్నీ కూడా రూమర్స్‌కే పరిమితం. మరి ఆలియా భట్ నిజంగానే కల్కి-2లో కనిపిస్తారా? లేక రూమరా? ఒకవేళ నిజమైతే ఆమె రోల్ ఏంటి? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే ప్రొడక్షన్ హౌస్ వైజయంతీ మూవీస్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే.

# అఖిల్ 'లెనిన్'.. పెద్ద ప్లానే ఇది..



అఖిల్ అక్కినేని హీరోగా తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ మూవీ లెనిన్. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఆ సినిమా రిలీజ్ డేట్ మరోసారి మారడంతో అభిమానుల్లో నిరాశ నెలకొన్నప్పటికీ, మూవీ టీమ్ చేస్తున్న కొత్త ప్రయత్నాలు మాత్రం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ సీనియర్ స్టార్ హీరో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారనే ప్రచారం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మొదట జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రావాల్సిన లెనిన్ మూవీ.. రీసెంట్ గా జూలై 10వ తేదీకి వాయిదా పడింది. ఆ విషయాన్ని నిర్మాత నాగార్జున స్వయంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. విడుదల ఆలస్యంపై వస్తున్న రూమర్లకు చెక్ పెడుతూ, ప్రేక్షకులకు బెస్ట్ థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ అందించడమే ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణమని స్పష్టం చేశారు. "ప్రేక్షకులకు 100% పర్ఫెక్ట్ అవుట్ పుట్ ఇవ్వాలనేది మా టార్గెట్. అందుకోసం మూవీ టీమ్ మరికొంత సమయం కోరింది. వాళ్ల పట్టుదల చూసి నేను కూడా అంగీకరించా. ఆ సినిమాతో ప్రేక్షకులు సరికొత్త అఖిల్ ను చూస్తారు" అంటూ నాగార్జున ధీమా వ్యక్తం చేశారు. అయితే ఆ మూవీ పోస్ట్‌పోన్ వెనుక టెక్నికల్ రీజన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో మేకర్స్ పెద్ద ప్లాన్ హాట్ టాపిక్‌గా మారింది. ఓ సీనియర్ స్టార్ హీరో లెనిన్ చిత్రానికి వాయిస్ ఓవర్ అందించనున్నట్లు తెలుస్తోంది. కథను ముందుకు తీసుకెళ్లే కీలక సీన్స్‌లో ఆ వాయిస్ వినిపిస్తుందా? లేక ఇంట్రో సీన్‌కు పరిమితం అవుతుందా? అనే విషయంపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. అయితే, స్టార్ హీరో వాయిస్ యాడ్ కావడం వల్ల సినిమాకు మరింత వెయిట్ పెరుగుతుందని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అఖిల్ రగ్గడ్ మాస్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు కొత్త ప్రచారం సినిమాపై అంచనాలను మరో రేంజ్ కు తీసుకెళ్తోంది. దీంతో లెనిన్ కోసం మేకర్స్ నిజంగా పెద్ద ప్లాన్ అమలు చేస్తున్నారనే చర్చ నెటిజన్లలో మొదలైంది. అయితే ఆ ప్లాన్ ఇప్పుడు ఎంతవరకు సక్సెస్ అవుతుందన్న విషయం కూడా ఆసక్తికరంగా మారింది. రాయలసీమ బ్యాక్ డ్రాప్‌లోని రొమాంటిక్ హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న లెనిన్ చిత్రానికి వినరో భాగ్యము విష్ణు కథ ఫేమ్ మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శివాజీ, శరణ్య ప్రదీప్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.

సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్లపై నాగవంశీ, నాగార్జున నిర్మిస్తున్న ఆ చిత్రం అఖిల్ కెరీర్ లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టు అనే చెప్పాలి. అయితే వరుస వాయిదాలతో కొందరు ఫ్యాన్స్ కాస్త అసంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ.. నాగార్జున ఇచ్చిన హామీ, కొత్తగా వినిపిస్తున్న స్టార్ వాయిస్ ప్రచారం ఫ్యాన్స్‌లో మళ్లీ జోష్ నింపుతున్నాయి. దీంతో ఇప్పుడు అందరి చూపు జూలై 10పైనే ఉంది. మరి ఆ భారీ ప్రాజెక్ట్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# మెగా ఫ్యాన్స్‌కు డబుల్ రిలీఫ్!



గత కొన్ని రోజులుగా టాలీవుడ్‌లో మెగా హీరోలకు సంబంధించిన రెండు వార్తలు సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి. ఒకటి మెగాస్టార్ చిరంజీవి-డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ఆగిపోయిందన్న ప్రచారం. మరొకటి రామ్ చరణ్ - శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ దాదాపు ఫిక్సైందనే వార్త. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ రెండు ప్రచారాల్లోనూ ఎలాంటి నిజం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా శ్రీకాంత్ ఓదెల పేరు చుట్టూ ఈ మధ్య భారీ స్థాయిలో చర్చ జరగడం విశేషమనే చెప్పాలి. దసరా వంటి సక్సెస్‌ఫుల్ మూవీతో డైరెక్టర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని హీరోగా ది ప్యారడైజ్ సినిమా చేస్తున్నారు. నాని సినిమా తర్వాత శ్రీకాంత్, మెగాస్టార్ చిరంజీవిని డైరెక్ట్ చేయనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు అఫీషియల్ గా అనౌన్స్ అయింది కూడా. ఓ వైపు సినిమాపై భారీ అంచనాలుండగా, అదే సమయంలో అనధికారిక ప్రచారాలు కూడా ఎక్కువవుతున్నాయి. ఇటీవల చిరంజీవి - శ్రీకాంత్ ఓదెల ప్రాజెక్ట్ నిలిచిపోయిందని, కథ లేదా ఇతర కారణాల వల్ల సినిమా ముందుకు వెళ్లడం లేదని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. కానీ ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని తెలుస్తోంది. ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎలాంటి క్యాన్సిల్ డెసిషన్ తీసుకోలేదని, సినిమా విషయంలో ఇప్పటికీ ప్రణాళికలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. దీంతో ఈ కాంబినేషన్ కోసం ఎదురు చూస్తున్న మెగా ఫ్యాన్స్‌కు ఇది ఊరటనిచ్చే విషయంగా మారింది. మరోవైపు రామ్ చరణ్ - శ్రీకాంత్ ఓదెల సినిమా దాదాపు ఖరారైందని, త్వరలో అధికారిక ప్రకటన కూడా వస్తుందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కొందరు అయితే దీనినే చరణ్ చేయబోయే నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందని సమాచారం.

రామ్ చరణ్ నెక్స్ట్ మూవీ సుకుమార్ దర్శకత్వంలో ఉంటుందని, సుకుమార్ సినిమా తర్వాత ఏ ప్రాజెక్టు చేస్తారనే విషయంలో ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. తదుపరి సినిమాకు సంబంధించి డైరెక్టర్‌ను ఎంపిక చేసే ప్రక్రియ కూడా ఇంకా పూర్తి కాలేదని సమాచారం. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఓ విషయం స్పష్టమవుతోంది. శ్రీకాంత్ ఓదెల ఒకేసారి ఇద్దరు మెగా హీరోలతో సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం ఎంత వేగంగా వైరల్ అయిందో, అంతే వేగంగా ఆ వార్తలపై సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఆయన ఫోకస్ ప్రస్తుతం ఇప్పటికే ఉన్న కమిట్‌మెంట్లు, ప్రణాళికలపైనే ఉందని తెలుస్తోంది. మొత్తంగా చూస్తే మెగా క్యాంప్ చుట్టూ తిరుగుతున్న ఈ రెండు రూమర్లకు తాజాగా స్పష్టత వచ్చినట్టే కనిపిస్తోంది. దీంతో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఊహాగానాలకు తాత్కాలికంగా తెరపడినట్టే కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టుల విషయంలో ఇకపై అధికారిక ప్రకటనలు వచ్చే వరకు ఇలాంటి వార్తలను అభిమానులు జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సినీ విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతోంది.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధిలో పరుగులు

**- ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రణాళిక - గజపతినగరంలో 10 వేల ఉద్యోగాల భర్తీయే లక్ష్యం - రెండేళ్ల ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమం సంతోషం - దశాబ్దాల కాలం నుండి రోడ్లు లేని కొత్తపాలెం, జె గుమడం గ్రామాలలో రోడ్లు ప్రారంభం - కూటమి నాయకుల ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం - యువగళంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ కృషి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్**









**బొండపల్లి/ గజపతినగరం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభు త్వం రెండేళ్ల సమయంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ చేపట్టిన రెండేళ్ల ప్రజా పాలన విజయోత్సవ సభా సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం బొండపల్లి మండలం జె గుమడం గ్రామంలో విజయోత్సవ సభా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రు. 2 కోట్ల 34 లక్షలతో నిర్మించిన కొత్తపాలెం – జీడిపాలెం రోడ్డు , 50 లక్షల రూపాయలతో నిర్మించిన జె గుమడం రోడ్డు ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. దశాబ్దాల కాలం నుంచి రోడ్లు లేని గ్రామాలకు రోడ్డు నిర్మాణంతో మంత్రికి జేజేలు పలుకుతూ, తీన్మార్ వాయిద్యాలతో, మహిళలు మంగళహారతులు పడుతూ స్వాగతం పలికారు. సభా ప్రాంగణానికి మంత్రి సైకిల్‌పై వచ్చారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాల ఫోటో ప్రదర్శన, ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన, నవధాన్యాల సాగు ప్రదర్శన, అంగన్వాడి చిన్నారులకు అందించే పోషకాహారాల ప్రదర్శన, వైద్య సిబ్బంది ప్రదర్శనతో పాటు ప్రముఖ కళాకారుడు జానకి రాము రేలారే రేలారే జానపద గేయాల ప్రదర్శన ప్రజలను విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా లబ్ధిదారులను శాలువాలతో మంత్రి కొండపల్లి సత్కరించారు. ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు మండలాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన అభివృద్ధి కార్యక్రమాల నిధులను తెలియపరిచారు. గంట్యాడ మండలం తరపున పార్టీ అధ్యక్షులు భాస్కర నాయుడు ఆధ్వర్యంలో భారీ గజమాలతో మంత్రి కొండపల్లిని సత్కరించి నాగలి బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోడీ నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డబల్ ఇంజిన్‌తో ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధితో ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టి కాంగ్రెస్ చేసిన నష్టంతో పాటు వైసీపీకి ఒక్క ఛాన్స్‌తో రెండింతల నష్టం జరిగిందని, వైసీపీ 10 లక్షల కోట్ల రూపాయల అప్పుల భారాన్ని ఆంధ్ర ప్రజలపై మోపిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రతినిత్యం ప్రజల్లో ఉండాలని సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించాలని, ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారన్నారు.

**వైసీపీ ఐదేళ్లలో ఆంధ్రాకు చేసింది సున్నా ప్రోగ్రామ్ చేయాలి :**

వైసిపి చేయాల్సింది రెండేళ్ల వెన్నుపోటు కార్యక్రమం కాదు... ఐదేళ్లలో ఆంధ్రాకు చేసింది సున్నా అన్న కార్యక్రమం చేయాలన్నారు.

యువగళం కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యను మంత్రి లోకేష్ సారథ్యంలో పరిష్కారానికి కృషి చేస్తున్నారనీ, ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ సమన్వయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడం, అనకాపల్లిలో నూతన స్టీల్ ప్లాంట్ నిర్మాణం, భోగాపురం ఎయిర్‌పోర్ట్ సాధన, వైజాగ్‌లో గూగుల్ వంటి సంస్థలను కేంద్రం సహకారంతో తీసుకు రావడం జరిగిందన్నారు. విజయనగరం జిల్లాలో రిలయన్స్ డేటా సెంటర్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, జీడి గింజల ఇండస్ట్రీ ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం ఈ ప్రాంతంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఉన్న మక్కువ తెలియజేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గజపతినగరంలో పది వేల ఉద్యోగాల కోసం ప్రణాళిక సిద్ధం చేయటం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు రాజేష్ వర్మ, నియోజకవర్గ ఇన్చార్జి భగ్గ అర్చన, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ జడ్పిటిసి మక్కువ శ్రీధర్, టిడిపి సీనియర్ నాయకులకు కొండపల్లి కొండల రావు, మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, రాపాక అచ్చం నాయుడు, కొండపల్లి భాస్కర నాయుడు, పోలిపర్తి స్వామి నాయుడు, సొసైటీ చైర్మన్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, మాజీ సర్పంచులు, కూటమి నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# వాస్తవాల సమాహారం - మధ్యతరగతి మందహాసం





**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఒక మంచి కథల పుస్తకం మనకు తెలియకుండానే మన ఆలోచనా దృక్పథాన్ని మారుస్తుంది, నైతిక విలువలను గుర్తు చేస్తుంది. ఒక మంచి స్నేహితుడిలా మనతో ప్రయాణిస్తుంది. అటువంటి విలువలను పూర్తిగా నింపుకున్న బెహరా వెంకట సుబ్బారావు సర్వలభ్య రచనల సంకలనం "మధ్య తరగతి మందహాసం" ద్వితీయ ముద్రణ ఆవిష్కరణ సభ తెలంగాణా ప్రభుత్వం, భాషా మరియు సంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎమెస్కో పబ్లిషర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన దైవజ్ఞశర్మ సంకలనం ఆవిష్కరించి మాట్లాడుతూ అలతి అలతి పదాలలో అనంత అర్థాలు ఉంటాయని, తన కథల ద్వారా ఒకపక్క సమాజానికి మార్గదర్శకంగావిస్తూ మరోపక్కనీతిని ప్రబోధించిన ఘనత బెహరా వెంకట సుబ్బారావుదేనని అభివర్ణించారు. సభకు అధ్యక్షత వహించిన సీనియర్ పాత్రికేయులు గుండు వల్లీశ్వర్ మాట్లాడుతూ మహాభారతంలోని భీష్ముడు, ధర్మ రాజుకు చెప్పినట్లుగా వృత్తి ధర్మాన్ని మించిన ఉత్కృష్టమైన ధర్మమేమి లేదని, అటువంటి ధర్మాన్ని ఉపదేశిస్తూ ఉదహరిస్తూ, బెహరా సుబ్బారావు గారి కథల్లో సారాంశము నింపారని పేర్కొన్నారు. చిత్రకారుడు బ్నిం మాట్లాడుతూ ఏ రచయిత రాసిన కథల్లోనైనా ఒక దుష్ట పాత్ర ఉంటుందని కానీ సుబ్బారావు కథల్లో అన్నీ మంచి పాత్రలే ఉన్నప్పటికీ ఆ కథనం అందరినీ ఆకట్టుకుంటుందని అన్నారు. తాను 200 పైగా కథలు రాశానని కానీ దుష్ట పాత్రలు లేకుండా రాయలేదని గుర్తు చేశారు. డా.చిల్లర భవాని దేవి మాట్లాడుతూ సుబ్బారావు రాసిన కథలు అన్నీ మన ఇళ్లల్లో రోజూ జరిగే వాస్తవాలే అని, అన్ని పాత్రలు సహజ సిద్ధంగా ఉంటాయని, పాత్రాల్లోని బలహీనతలనే ప్రధానంగా మలిచారని, సుబ్బారావు కథలను చిన్నప్పటి నుండి చదువుతూనే ఉన్నానని పేర్కొన్నారు. ప్రముఖ హాస్య నటుడు, రచయిత డాక్టర్ గుండు సుదర్శన్ మాట్లాడుతూ పుస్తకావిష్కరణ పండుగ వాతావరణంలో జరిగిందని, సుబ్బారావు మళ్ళీ పుట్టారని వారి అక్షర రూపాన్ని తిరిగి ఆవిష్కరణ చేసే భాగ్యం కలిగింది అని అన్నారు. సంచిక అంతర్జాల పత్రిక సహ సంపాదకుడు కల్లూరి సోమ శంకర్ కథలపై సమీక్ష చేస్తూ సునిశితమైన హాస్యాన్ని కథలలో జోడిస్తూ తను చెప్పవలసిన విషయాన్ని సున్నితంగా చెబుతూ ప్రతి కథకి గొప్ప కొసమెరుపులు ఇచ్చారని పేర్కొన్నారు కలిగోట్ల సన్యాసి రాజు బెహరా వెంకట సుబ్బారావు సాహిత్యాన్ని ఆయనతో తనకు గల సాన్నిహిత్యాన్ని పరిచయం చేశారు. పుస్తక సంపాదకులు సుబ్బారావు కుమారుడు బెహరా సత్యనారాయణ మూర్తి స్పందిస్తూ నాన్నగారి కథలు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సామాజిక చైతన్యానికి దోహదపడ్డాయని, మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలలో ఉన్న నిజాయితీని నైతిక విలువలను వీరి కథలు ప్రతిబింబించాయని పేర్కొన్నారు. పుస్తకం ద్వితీయ ముద్రణకు పూనుకొన్న ఎమెస్కో బృందానికి, ఎంతో అభిమానంగా అడిగిన వెంటనే ఒప్పుకొని సభ గౌరవాన్ని ఇనుమడింప చేసిన పెద్దలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. సుమారు 3 గంటల పాటు సాగిన సాహిత్య సభ అందరిని అలరించింది.

# పాఠశాలలో విద్యా గణపతి హోమం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం కొత్తగ్రహారం మూడో వీధిలో గల బ్లూమింగ్ మైండ్స్ ప్లే స్కూల్ లో విద్యా గణపతి హోమం భక్తి శ్రద్ధలతో చేశారు. విద్యా గణపతి హోమం విద్యార్థులకు, జ్ఞానాన్వేషకులకు అత్యంత ఫలదాయకమైన, పవిత్రమైన క్రతువు. విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి 32 రూపాలలో 'విద్యా గణపతి' అవతారం బుద్ధికి, జ్ఞానానికి మరియు సృజనాత్మకతకు ప్రతీక.ఉపనిషత్తుల ప్రకారం 'సా విద్యా యా విముక్తయే', ఏదైతే ముక్తిని ఇస్తుందో అదే నిజమైన విద్య. కేవలం ఉద్యోగం కోసం, డబ్బు కోసం నేర్చుకునేది అక్షర జ్ఞానం మాత్రమే. కానీ అహంకారాన్ని, అజ్ఞానాన్ని పారద్రోలి, 'నేను ఎవరు?' అనే సత్యాన్ని, బ్రహ్మజ్ఞానాన్ని తెలుసుకోవడమే నిజమైన విద్య. విద్యా గణపతి ఈ ఉన్నతమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. హోమ గుండంలో వెలిగే అగ్ని మనలోని 'జ్ఞానాగ్ని'కి ప్రతీక. హోమంలో మనం సమర్పించే ద్రవ్యాలు మనలోని అజ్ఞానం, బద్ధకం, మూర్ఖత్వం మరియు దురాలోచనలకు ప్రతీకలు. అజ్ఞానాన్ని జ్ఞానాగ్నిలో ఆహుతి చేసినప్పుడు మనస్సు పరిశుద్ధమవుతుంది.విద్యా గణపతి హోమం అనేది బయట చేసే ఒక క్రతువు మాత్రమే కాదు, అంతర్గతంగా మనలో ఉన్న జ్ఞాన జ్యోతిని వెలిగించుకునే ప్రక్రియ. బుద్ధిని చైతన్యపరచి, అజ్ఞానపు చీకట్లను తొలగించి, జీవితాన్ని ఒక సార్థకమైన మార్గంలో నడిపించేందుకు ఈ హోమం ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక సాధన. ఈ హోమం చేయడం వల్ల చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది. విద్యార్థుల్లో ఉండే మతిమరుపు తొలగి, చదివిన విషయాలు సులభంగా గుర్తుండేలా జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుంది. చదువులో వచ్చే అడ్డంకులు తొలగిపోయి, విద్యాభ్యాసం సాఫీగా సాగేలా గణపతి అనుగ్రహిస్తాడు. విద్యార్థుల్లో సహజంగా ఉండే భయం, ఒత్తిడి తొలగిపోయి, మనోధైర్యం, ఆత్మవిశ్వాసం కలుగుతాయి.

# వైద్య రత్న డాక్టర్ ఎం.వి.కోటిరెడ్డికి ఘన పదవీ విరమణ సన్మానం





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సుదీర్ఘకాలం పాటు విశేష వైద్య సేవలను అందించి, ప్రజల గుండెల్లో అపారమైన అభిమానాన్ని సంపాదించుకున్న డాక్టర్ ఎం.వి.కోటిరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం రాఘవ నిలయం భద్రాచలంలో అత్యంత ఘనంగా జరిగింది. భద్రాచలం రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సన్మాన మహోత్సవంలో పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, మిత్రులు మరియు ఆయన కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ కోటి రెడ్డి సేవలను కొనియాడారు. వైద్య రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలు, ఆయనకున్న నిరాడంబర వ్యక్తిత్వం మరియు రోగుల పట్ల ఆయన చూపిన అంకితభావాన్ని వక్తలు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు రెడ్డి సోదరులు మాట్లాడుతూ..."ఏజెన్సీ ప్రాంతమైన, గిరిజనులు, పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించే ఈ భద్రాచలంలో, నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంత ప్రజలకు డాక్టర్ కోటిరెడ్డి గత 12 సంవత్సరాలుగా వేలాది మంది రోగులకు నాణ్యమైన వైద్యం అందించి ప్రజల గుండెల్లో నిలిచారు. ఈ ఘనత ఒక్క డాక్టర్ కోటిరెడ్డికే దక్కుతుంది" అని కొనియాడారు. ఇంతటి మంచి పేరు తెచ్చిన కోటిరెడ్డి తల్లిదండ్రులకు వక్తలు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. అనంతరం డాక్టర్ కోటిరెడ్డి దంపతులను గజమాలతో, శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులందరూ ఆయన పదవీ విరమణ జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆ రామచంద్ర మహాప్రభువును ఆకాంక్షిస్తూ ప్రార్థించారు.

ఈ కార్యక్రమం భద్రాచలం రెడ్డి భవన్ కన్వీనర్ మందపాటి సుధాకర్ రెడ్డి, ఈసీ మెంబర్ బోగాల శ్రీనివాస్ రెడ్డి, ఆడిట్ మెంబర్ జి.వి.రమణా రెడ్డి, సభ్యులు క్వెస్ట్ రాజా రెడ్డి మరియు మారం వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి ప్రముఖులు బూసిరెడ్డి శంకర్ రెడ్డి, గాదె మాధవ రెడ్డి, బిలిపెల్లి రంగారెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బి.వి. రమణా రెడ్డి, మోర్తాల సిద్ధారెడ్డి, రామకృష్ణ రెడ్డి, సిపిఎం పార్టీ బాల నర్సారెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ రామిరెడ్డి, అన్నెం కోటి రెడ్డి, సూర్య హాస్పటల్ జయచంద్రా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, చైతన్య రెడ్డి,బి.ఆర్.టి. యు. జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్ రెడ్డి పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏరియా హాస్పిటల్ సుపెరిడెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ నరసింహా రెడ్డి, డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ యుగంధర్ రెడ్డి, డాక్టర్ సుకృత, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ పవన్ రెడ్డి, గీతా పావని, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ సాయి తేజ్ రెడ్డి దంపతులు మరియు రెడ్డి నియోజకవర్గ సోదర సోదరీమణులు దంపతులతో సహా పాల్గొని కోటిరెడ్డికి నిండు నూరేళ్లు వర్ధిల్లాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

# మహాకవి శ్రీశ్రీకి ఘనంగా నివాళులు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** తెలుగు కవిత్వానికే కొత్త రక్తం ఎక్కించిన మహాకవి శ్రీశ్రీ అక్షరాలు రగిలే విప్లవాగ్ని కణాలు అని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వప్న హైందవి పేర్కొన్నారు. మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకొని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ అభ్యుదయ సాహితి యుగకర్త అని పేర్కొన్నారు .సమితి అధ్యక్షులు గురు ప్రసాద్ మాట్లాడుతూ సాంప్రదాయ ఛందస్సుల సంకెళ్లను తెంచి, సామాన్యుడి శ్రమను, ఆవేదనను, ఆకలి మంటలను కవిత్వంగా మలచి తెలుగు సాహిత్యానికి "మహాప్రస్థానం" చూపించిన ఘనత శ్రీరంగం శ్రీనివాసరావుకి దక్కుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ గురజాడ అప్పారావు వారసులు గురజాడ వెంకటేశ్వర ప్రసాద్, ఇందిరా దంపతులు, సమితి ఉపాధ్యక్షులు కాగుపాటి నారాయణమూర్తి, సలహాదారు ముళ్ళ పూడి సుభద్రాదేవి, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయనగరం జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు బోండా రమేష్, బాలు, కంటో న్మెంట్ వాసవి సంఘం అధ్యక్ష కార్యదర్శులు డిమ్స్ రాజు, బత్తుల కామేష్, నంది పురస్కార గ్రహీత ఈపు విజయ్ కుమార్, ప్రముఖ న్యాయవాది దాసరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పిచ్చిరెడ్డి కళ్యాణ మండపంలో మూలపేట శివాలయం మాజీ ఈఓ ఆరంభాకం వేణుగోపాల్ కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వధూవరులు కలకాలం సుఖ సంతోషాలతో జీవించాలని చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.

# హ్యాపీ బర్త్ డే టూ యు నారాయణ సార్

**- 3వ డివిజన్లో ఘనంగా మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు - పేదల జీవితాలలో విజయ దీపాలు వెలిగిస్తున్న మంత్రి నారాయణ : కోమరి విజయమ్మ వేణుగోపాల్**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక మూడవ డివిజన్ అధ్యక్షురాలు కోమరి విజయమ్మ వేణుగోపాల్ మున్సిపల్ శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సింహపురి కాలనీ ప్రాం తంలో స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేపట్టి పేద ప్రజలకు అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక అసాధా రణ ధ్రువతార మంత్రి నారాయణ అని నెల్లూరు నగరాన్ని ఒక స్మార్ట్ సిటీగా రూపొందిస్తూ పేదల జీవితాలలో విజయ దీపాలు వెలిగిస్తున్న మంత్రి నారాయణకి ఆ భగవంతుడు నిండు నూరే ళ్ల సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆశీర్వదించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు పుత్తూరు శైలజ, కోవి రమణయ్య, నారాయణరెడ్డి, పులుసు వాసు, పి.తులసి, టిడిపి పార్టీ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాత మంత్రి నారాయణ సార్

**- 7వ డివిజన్లో ఘనంగా మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు**

**- మంత్రి నారాయణ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలి : కిన్నెర మాల్యాద్రి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక ఏడవ డివిజన్ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి నేడు మున్సిపల్ శాఖ మంత్రి వర్యులు పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలను వారి కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. భారీ ఫ్లెక్సీలు బాణాసంచా కాల్చి భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ విద్యా, సేవే ధ్యేయంగా నెల్లూరు ప్రగతికి అమరావతి నిర్మాణానికి అలుపెరగకుండా శ్రమిస్తున్న మహానేత మంత్రి నారాయణ అని వారు ఇలాంటి పుట్టిన రోజులు నిండు నూరేళ్లు జరుపుకొని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తమ మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ కిన్నెరసాగర్, కిన్నెర కార్తిక్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిన్నీస్ బుక్ రికార్డు బ్రేక్ చేసేందుకు చిత్రకారులు అమీర్ జాన్ ప్రయత్నం

**- 107 చేతి ముద్రలు వేసి రికార్డు బ్రేక్**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు షేక్ అమీర్ జాన్ మరోసారి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేందుకు గాను పెయింట్‌తో అత్యధిక చేతి ముద్రలు ఒక్క నిమిషములో వేసే అంశాన్ని ఎంచుకొన్నారు. గత గిన్నీస్ రికార్డు మహారాష్ట్ర, కళ్యాణ్‌కు చెందిన దినేష్ గుప్తా ఒక్క నిమిషంలో 99 చేతిముద్రలు వేసి 8 డిసెంబర్ 2025లో రికార్డు సాధించారు. ఆ రికార్డును బ్రేక్ చేసేందుకు అమీర్ జాన్ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారికి దరఖాస్తు చేసుకోగా వారు దరఖాస్తును అంగీకరించి 260218095534 (ఎం పి హెచ్ ఐ) గా ధృవీకరించి రికార్డు బ్రేక్ చేసేందుకు అనుమతి ఇచ్చారు. నెల్లూరు టౌన్ హాల్‌లో ఆదివారం ఉదయం ఓపెన్ ఆడిటోరియం నందు ఒక్క నిమిషములో అమీర్ జాన్ పెయింట్‌తో 107 చేతి ముద్రలు వేసి రికార్డు బ్రేక్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణీతలు, పరివేక్షణ ప్రక్రియ, సమయం ధృవీకరించుట మరియు చేతిముద్రలు లెక్కించేందుకు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. గిన్నీస్ రికార్డు పత్రాలు సాక్షి సంతకాలు గిన్నీస్ వారికి పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో హోటల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, ప్రభుత్వ అధికారులు నెల్లూరు జిల్లా గ్రంథాలయ అధికారి కె.కుమార్ రాజా, నెల్లూరు సిటీ ఎమ్.ఇ.ఓ. సయ్యద్ అబ్దుల్ హమీద్, ప్రధానోపాధ్యాయులు ఏ. తిరుమల రాజు, పి.వెంకటేశ్వర్రావు, టైమ్ కీపర్స్ ప్రభుత్వ వ్యయామ ఉపాధ్యాయులు పి.రమేష్, డి. కృష్ణ మోహన్, మిరాకిల్స్ వరల్డ్ రికార్డు జూరి మెంబర్ తిమ్మిరి రవీంద్ర పాల్గొన్నారు.

# విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాలకు కొత్త ప్రిన్సిపాల్‌గా ఆచార్య టి.వీరారెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాలకు కొత్త ప్రిన్సిపాల్‌గా ఆచార్య టి. వీరారెడ్డిని నియమిస్తూ విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించనున్న ఆచార్య టి.వీరారెడ్డికి ఆచార్య సి.హెచ్.విజయతో పాటు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# పల్లంరెడ్డి హరి ప్రసాద్ రెడ్డి సోదరులు పల్లంరెడ్డి సుప్రసాద్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు బాలాజీ నగర్‌లో పల్లంరెడ్డి హరిప్రసాద్ రెడ్డి సోదరులు పల్లంరెడ్డి సుప్రసాద్ రెడ్డి పార్థివ దేహానికి వైస్సార్సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ మీజ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. సుప్రసాద్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.

# ప్రశాంత్ అయ్యోర్యారు ఇక లేరు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఆర్ఎస్ఆర్ నగర పాలకోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ప్రశాంత్ గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం ఉదయం పాఠశాలకు హాజరైన ఆయన అందరితో కలివిడిగా మాట్లాడ్డం.. విద్యార్థులకు పుస్తకాలు ఇప్పించడం..మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. కొద్దిసేపటికే ఛాతీలో నొప్పి రావడంతో మరో ఇద్దరు ఉపాధ్యాయులతో కలసి రామచంద్రారెడ్డి హస్పెటల్‌కు వెళ్లారు. అక్కడ స్ట్రోక్ అని చెప్పి మెడికవర్ హస్పెటల్‌కు వెళ్లాలని సూచించారు. అంబులెన్స్‌లో వెళ్తుండగా మార్గం మధ్యలో ప్రశాంత్ అయ్యోర్యారు కన్ను మూశారు. ప్రశాంత్ సర్.. ఈ ఏడాది డిసెంబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన మృతితో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు విషాదంలో మునిగిపోయారు. ప్రశాంత్ టీచర్‌కు వివాహం కాలేదు. ఆయన ఉపాధ్యాయ వృత్తిలోనే సంతోషం చూసుకున్నారు. గతంలో ఆయన ఎక్కువ కాలం వెంకటేశ్వరపురంలోని నగర పాలకోన్నత పాఠశాలలో పని చేసారు. మంచి పేరు తెచ్చుకున్నారు.

# అంజనీ లే అవుట్‌లో కార్పొరేషన్ కమిషనర్ తనిఖీలు

**- అనేక అంశాలను తనిఖీ చేసిన కమిషనర్ - అనుమతులు, ప్లాను తదితర పత్రాల పరిశీలన**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ స్థానిక అల్లీపురంలోని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక అల్లీపురంలోని అంజనీ లే అవుట్, 4వ మైలు కొత్త కాలువ ప్రాంతాలలో నూతనంగా నిర్మిస్తున్న లే అవుట్‌లను టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. లేఅవుట్‌ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు, ప్లాను తదితర పత్రాలను కమిషనర్ తనిఖీ చేసి లే అవుట్ నిర్వాహకులకు వివిధ సూచనలు జారీ చేశారు. లే అవుట్‌లలో నూతనంగా నిర్మిస్తున్న ప్రహారీ, రోడ్లు, డ్రైన్ కాలువలు, విద్యుత్ విధి దీపాలు, ఇతర మౌలిక వసతులను కమిషనర్ తనిఖీ చేశారు. అనుమతించిన మేరకు మాత్రమే లేఔట్ నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘునాథ రావు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు. 4వ మైలు కొత్త కాలువ ప్రాంతాలలో నూతనంగా నిర్మిస్తున్న లే అవుట్‌లను టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. లేఅవుట్‌ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు, ప్లాను తదితర పత్రాలను కమిషనర్ తనిఖీ చేసి లే అవుట్ నిర్వాహకులకు వివిధ సూచనలు జారీ చేశారు. లే అవుట్‌లలో నూతనంగా నిర్మిస్తున్న ప్రహారీ, రోడ్లు, డ్రైన్ కాలువలు, విద్యుత్ విధి దీపాలు, ఇతర మౌలిక వసతులను కమిషనర్ తనిఖీ చేశారు. అనుమతించిన మేరకు మాత్రమే లేఔట్ నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘునాథరావు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎన్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# ఎల్ఓసీ సమీపంలో గ్రనేడ్ పేలి నలుగురు సైనికులకు గాయాలు



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి జిల్లా నౌషేరే సెక్టార్ పరిధిలో గ్రనేడ్ పేలి నలుగురు సైనికులు గాయపడ్డారు. వీరిలో ఒక జూనియర్ కమిషన్డ్ అధికారి కూడా ఉన్నారు. ఎల్ఓసీ వెంబడి కుమావోన్ రెజిమెంట్ యూనిట్‌కు చెందిన సైనికులు మంగళవారం నాడు రోజువారీ నిఘా, పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా మల్టీ మోడ్ గ్రనేడ్ పేలినట్టు అధికారులు ధ్రువీకరించారు. గాయపడిన జవాన్లను తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స జరుగుతోంది.

**గత వారంలోనూ...**

కాగా, జూన్ 9న ఇదే తరహా ఘటన జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా యురి సెక్టార్‌లో జరిగింది. ప్రమాదవశాత్తు ఒక హ్యాండ్ గ్రనేడ్ పేలిన ఈ ఘటనలో ఇద్దరు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా కన్నుమూశారు. గత మే 19న రాజౌరి జిల్లాలో రెండు మోర్టార్ షెల్స్, ఒక హ్యాండ్ గ్రనేడ్‌ను భద్రతా సిబ్బంది కనిపెట్టి వాటిని నిర్వీర్యం చేశారు.

# ప్రముఖ యువ గాయని శ్రీలలితకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అభినందనలు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడలో వివిధ కార్యక్రమాలలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ యువగాయని శ్రీలలిత నివాసానికి కేంద్ర మంత్రి విచ్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల సుపరిపాలన, సాధించిన విజయాలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని శ్రీలలితకు అందజేశారు. కర్ణాటక, హిందుస్తానీ సంగీత శైలులు రెండింటిలోనూ రాణిస్తున్న శ్రీలలితను ప్రహ్లాద్ జోషి అభినందిం చారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రెండు విభిన్న సంగీత ప్రక్రియలను నేర్చుకోవడం ఎంతో కష్టతరమన్నారు. గతంలో ప్రధాని మోదీ స్వయంగా శ్రీలలిత ప్రతిభను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశంసించారని తెలిపారు. కర్ణాటకలో ధార్వాడ్..హిందుస్తానీ సంగీతానికి ఎందరో మహానుభావులను అందించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ సాధించిన అద్భుత ప్రగతిని, ప్రపంచ సంక్షోభాల సమయంలోనూ దేశాన్ని సమర్థవంతంగా నడిపించిన తీరు గురించి అందరూ తెలుసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఇక్కడి రాజధానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు.



**దుర్గమ్మకు ప్రహ్లాద్ జోషి ప్రత్యేక పూజలు**

ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఇంద్రకీలాద్రి చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు, దుర్గ గుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని, వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు. అనంతరం కేంద్ర మంత్రికి అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

# సాగు చేస్తున్న పోడు భూముల జోలికొస్తే ఊరుకోము : సిపిఐ ఎంఎల్






**దుమ్ముగూడెం, (రాజధాని వార్తలు):** మాస్ లైన్ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శి సాయన్న హెచ్చరిక మండలంలోని ఏపీజీబీ బ్యాంకు సెంటర్ నుండి తాసిల్దార్ ఎంపీడీవో కార్యాలయం వరకు పోడు సాగు చేస్తున్న రైతులతో ర్యాలీ తాసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శి సాయి అన్న మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలం గౌరారంలో తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు ఎన్ని ప్రభుత్వాలు మారిన గిరిజన పోడు రైతులకు ఫారెస్ట్ అధికారుల నుంచి తిప్పలు తప్పడం లేదని నిరంతరం భూమి సాగులో ఉన్నప్పటికీ ఆర్ఓఎఫ్ఓ పట్టాలు పొందినప్పటికీ ఫారెస్ట్ అధికారుల బెదిరింపులు దౌర్జన ఆపడం లేదని అన్నారు గత పోయిన సంవత్సరం ఉన్న జిల్లా కలెక్టర్ పిఓ ఐటిడిఏ గౌరారం గిరిజన రైతులు సాగు చేస్తున్న పోడు భూములను పరిశీలించారు. పోడు సాగుదారులకు రెండు పంటలు వచ్చే మునగ పంటను వేసుకోమని కలెక్టర్ సూచించారు అయినప్పటికీ రైతులపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపడం లేదు. రైతుల జోలికొస్తే సహించేది లేదని అన్నారు. అదేవిధంగా ఫారెస్ట్ అధికారులు గౌరారం పోడు సాగు చేస్తున్న రైతులపై పెట్టిన అక్రమ కేసులలో వందమందికి పైగా ఉన్నారని వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఈ సీజన్లో సాగు చెయ్యటానికి పత్తి మోడల్ తీస్తున్న రైతులను అడ్డుకోవద్దని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా తాసిల్దార్ ఎంపీడీవోలకు 1 గౌరారం పోడు భూముల్లో సాగు చేస్తున్న రైతుల సమస్యను పరిష్కరించాలని 2 మండలంలో 200 షాపులు ఉన్నాయని చెరుపల్లి మారాయిగూడెం సీతారాంపురం నల్లబెల్లి గోడౌన్‌లో దాసి బెల్ట్ షాపులకి సప్లై చేస్తున్న వ్యక్తులపై చర్య తీసుకోవాలని 2 మినీ వ్యాన్‌లో ఆటోలో లోడ్ చేసి గ్రామాల్లో కిరాణా షాపులకు వేస్తున్న వాహనాలను గుర్తించి వారిపై కేసులు పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మడకం సమ్మక్క శీలం లక్ష్మీదేవి కొరశరాంశెట్టి పుణేశ్వరావు సీత సున్నం సుభద్ర ముద్దుల రాధా మడకం గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరుకు ఫారం-2 పంపిణీ చేయాలని, సర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించి, ఫారాలు నింపి బిఎల్ఒలకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఓటర్ మ్యాపింగ్ అంతా 2002 ఓటర్ లిస్ట్ ఆధారంగానే జరుగుతోంది. కావున 2002 ఓటర్ లిస్టు అందరికీ అందుబాటులో ఉంటుందని, దాని ద్వారా ఓటర్ వివరాలు తెలుసుకొని ప్రస్తుత ఓటర్ వివరాలతో ఫారం నింపి అందజేయాలని తెలిపారు. 2002 సంవత్సరం తరువాత ఓటర్ గా నమోదైన వారు 2002 ఓటర్ లిస్ట్‌లో తండ్రి లేదా తల్లి పేరు, సీరియల్ నంబర్ తెలుసుకొని వివరాలు బూత్ లెవెల్ అధికారికి అందజేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు బాధ్యతగా పని చేయాలని, ప్రతి ఓటును క్షుణ్ణంగా తనిఖీ చేసి నమోదు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్క ఓటర్ సవరణ లిస్టులో నమోదు కావాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan